www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 31 జులై 2023
5
వైఎస్ఆర్

పుష్పగిరిలో హైకోర్టు న్యాయమూర్తి ప్రత్యేక పూజలు

వల్లూరు : పుష్పగిరి పుణ్యక్షేత్రం శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సోమ యాజులు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఆలయ అధికారులు, అర్చకులు మంగళ వాయిద్యాలతో వేద మంత్రాల నడుమున న్యాయమూర్తి దంపతులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైకోర్టు జడ్జి ఆలయ పరిసరాలలో పరిశీలించి ఆలయ కళా సంపద , చరిత్ర గురించి అడిగి తెలుసుకున్నారు. వారి వెంట తహశీల్దార్ శంకర్రావు, ఎస్ఐ పెద్ద ఓబన్న

న్యాయమూర్తి దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

రైతుల ప్రయోజనమే
పరమావధి

- పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటాం
- 74 మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు
- రీజనల్ జాయింట్ డైరెక్టర్ చల్లా రామాంజనేయులు వెల్లడి

ముఖాముఖి

రైతు ప్రయోజనమే పరమావధిగా పని చేస్తాం. ఈ-నామ్ వంటి ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా దేశీయ మార్కెట్లను రైతు ముంగిటకు చేరువ చేశాం. ఫలితంగా జిల్లాలోని రైతాంగ ఉత్పత్తులకు దేశంలోని ఏయే మార్కెట్లలో ఎటువంటి గిరాకీ ఉందో ముందుగానే తెలుసుకునే సౌలభ్యం కలిగింది. రాయలసీమ రీజియన్ పరిధిలో 74 మార్కెట్‌యార్డు వివరాలను అందుబాటులో తెచ్చాం. పత్తి ఎంఎస్‌పి ధరలు ఏటా పెరుగు తున్న నేపథ్యంలో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేసే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. రీజియన్ పరిధిలోని 259 గోడౌన్లలో వ్యవసాయ ఉత్పత్తు లను నిల్వ చేసుకునే సదుపాయాన్ని కల్పించాం. మార్కెట్లో మెరుగైన ధర లభించినప్పుడు విక్రయించుకునే అవకాశం ఉందని పేర్కొంటున్న రాయల సీమ రీజియన్ జాయింట్ డైరెక్టర్ చల్లా రామాంజనేయులుతో ప్రజాశక్తి ముఖాముఖి...
-ప్రజాశక్తి - కడపప్రతినిధి

మార్కెట్‌యార్డుల వివరాలు తెలపండి?
రీజియన్ పరిధిలో 74 మార్కెట్‌యార్డులున్నాయి. కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని మార్కెట్ యార్డుల ద్వారా ఈ- నామ్ తదితర సేవల ద్వారా మెరుగైన సేవల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

మార్కెట్ లావాదేవీల గురించి తెలపండి?
2022-2023లోరూ.120 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ నాటికి తిరుపతి మార్కెట్‌యార్డు మినహా మిగిలిన మార్కెట్‌యార్డులన్నీ పురోగమన దిశలో పయనిస్తుండడం ఆహ్వానించదగిన విషయం. మిగిలిన తొమ్మిది నెలల వ్యవధిలో రూ.122 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని సునాయాసంగా చేరు కునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం.

గోడౌన్ల సామర్థ్య వివరాలు తెలపండి?
రాయలసీమ రీజియన్ పరిధిలో 259 గోడౌన్లున్నాయి. 2,11,735 టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. కడపలోని 39 గోడౌన్లలో 30,315 టన్నులు, అనంతపురంలోని 44 గోడౌన్లలో 30,120 టన్నులు, చిత్తూరులోని 18 గోడౌన్లలో 17,950 టన్నులు, కర్నూలులోని 32 గోడౌన్లలో 35,940 టన్నులు, నంద్యాలలోని 41 గోడౌన్లలో 41, 600 టన్నులు, తిరుపతిలోని 34 గోడౌన్ లో 27, 100 టన్నులు, అన్నమయ్యలోని 21 గోడౌన్లలో 9,160 టన్నులు, సత్య సాయి జిల్లాలోని 30 గోడౌన్లలో 19,650 మెట్రిక్ టన్నుల మేర వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసు కునే అవకాశం ఉంది.

ఆదోని మార్కెట్ పురోగతిని వివరించండి?
రీజియన్ పరిధిలో అధిక ఆదాయం ఆదోని మార్కెట్ యార్డు ద్వారా సమకూరుతోంది. 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.16 కోట్ల ఆదాయం సంపాదించింది. ఇక్కడికి కర్ణాటకలోని రాయచూర్, తెలంగాణలోని గద్వాల్ తదితర ప్రాంతాల నుంచి సరుకుల లావాదేవీలు ఉన్నాయి. ఫలితంగా ఆదోని మార్కెట్‌యార్డు అత్యధిక ఆదాయాన్ని సమకూర్చుతోంది.

చెక్‌పోస్టుల వివరాలు, ఓనర్ గురించి తెలపండి?
రీజియన్ పరిధిలో 155 చెక్‌పోస్టులున్నాయి. అనంతపురం జిల్లాలో 32, చిత్తూరులో 60, కడపలో 28, కర్నూలు జిల్లాలో 35 చెక్‌పోస్టులున్నాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా చెక్‌పోస్టుల ద్వారా సెస్సుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది.

సిసిఐ ఏర్పాటు గురించి వివరించండి?
ప్రొద్దుటూరులో సిసిఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ వినిపిస్తోంది. విభజిత వైఎస్ఆర్ జిల్లావ్యాప్తంగా 55 వేల ఎకరాల్లో పత్తి పంట పెద్దఎత్తున సాగవుతోంది. ప్రతియేటా పెద్దఎత్తున దిగుబడుల నేపథ్యంలో ప్రొద్దుటూరు సిసిఐ కేంద్రాన్ని సీజన్ సమయంలో సిసిఐ అధ్వర్యంలో పత్తి సేకరణ చేపడుతోంది. ఇటీవల ఆర్‌బికె వ్యవస్థ అందుబాటులోకి రావడం ద్వారా ఆర్బికేల ద్వారా సేకరించిన పత్తిని మిల్లర్లకు సరఫరా చేయడం జరుగుతోంది. దీంతో సిసిఐ ఏర్పాటుపై స్పష్టత రావాల్సి ఉంది.

రీజియన్ మార్కెట్లోని క్రయ,విక్రయాల గురించి తెలపండి?
రీజియన్ పరిధిలోని మార్కెట్లలో అత్యధికంగా ఆదోని మార్కెట్ లో వ్యాపార కార్యకలాపాలు సాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పత్తి, వేరుశనగ, కందులు, పసుపు, టమోటో, మామిడి, కూరగాయలు, వాము మొదలగు ఇతర పంటల క్రయవిక్రయాల జోరు కొనసాగుతోంది.

విద్యుత్ ఉద్యమం ఉధృతం చేస్తాం

- కాంట్రాక్టు కార్మికులు రెగ్యులర్ అయ్యే వరకూ పోరాటం
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కామనూరు శ్రీనివాసులురెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్
విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వంతో 16 నెలలుగా 25 సార్లు చర్చలు జరిపినా ఎలాంటి సానుకూల స్పందన లేదని అందుకే ఎ.పి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసి విద్యుత్ ఉద్యమం ఉధృతం చేస్తున్నామని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈనెల 26న యాజమాన్యానికి సమర్పించిన వినతి పత్రంలోని అంశాలను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. వేతన సవరణ ఒప్పందం తర్వాత కూడా విద్యుత్ స్ట్రగుల్ కమిటీ పోరాటాలు చేస్తుందని పేర్కొన్నారు. జిల్లా నాయకులు యన్. శివశంకర్ మాట్లాడుతూ స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు ఈనెల 31న కలెక్టర్లకు వినతి పత్రం అందజేయడం, ఆగస్టు 2న జిల్లా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు, 7న తిరుపతి కార్పొరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలకు విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తరలి వచ్చి మన నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసి డివిజన్ నాయకులు అవధానం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ 16 నెలలు గడిచినా ప్రకటించక పోవడం అన్యాయమని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులను 25 ఏళ్లుగా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. ఆశా వర్కర్ల జిల్లా నాయకులు రాజామణి మాట్లాడుతూ విద్యుత్ స్ట్రగుల్ కమిటీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమని తెలిపారు. స్ట్రగుల్ కమిటీ ఉపాధ్యక్షులు గంగయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్‌టిపిపి నాయకులు వెంకట స్వామి, విజయా, రమేష్ సాంబశివారెడ్డి, నాగేంద్ర మాట్లాడుతూ ఉద్యమం ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా స్ట్రగుల్ కమిటీ నాయకులు నాగసుబ్బయ్య, శ్రీ హరి మాట్లాడుతూ 31వ తేదీన చర్చలు విద్యుత్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు, ఎనర్జీ అసిస్టెంట్లకు మేలు జరిగేలా ఉండాలని ఆకాంక్షించారు. బిల్డింగ్ యూనియన్ నాయకులు చంద్రారెడ్డి మాట్లాడుతూ స్ట్రగుల్ కమిటీ చేసే పోరాటాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా మాట్లాడుతూ ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లాల్లో యుటిఎఫ్ మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ యూనియన్ నాయకులు తారక రామ్ మాట్లాడుతూ మున్సిపాలిటీ రంగం నుంచి పూర్తిగా మద్దతు తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ పోరాటాలకు అండగా ఉంటామని తెలిపారు. ఎఐటియుసి నగర కమిటీ నాయకులు మద్దిలేట మాట్లాడుతూ స్ట్రగుల్ కమిటీ చేసే ఉద్యమం జయప్రదమతుందని పేర్కొన్నారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై దృష్టి సారించక పోవడం శోచనీయమని చెప్పారు. విద్యుత్ సంస్థలో రెండు కార్మిక సంఘాల వల్ల విద్యుత్ ఉద్యోగులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. చిన్న, చితకా సంఘాలన్నీ కేవలం తమ సొంత ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో వామపక్ష కార్మిక సంఘాలు, మరి కొన్ని సంఘాలు కలుపు కుని స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసారని చెప్పారు. ఈ స్ట్రగుల్ కమిటీ విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆరు నెలల బుడతడి నోబెల్ వరల్డ్ రికార్డ్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)
ప్రజ్వల్ అనే ఆరు నెలల చిన్నారి అంతర్జాతీయ అవార్డు సాధించి అందరినీ అబ్బుర పరిచాడు. ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని శాస్త్రినగర్‌కు చెందిన పవన్‌కుమార్, సౌమ్యప్రియ దంపతులకు నాలుగేళ్ల వినీషతోపాటు ఆరునెలల కుమారుడు ఉన్నాడు. ఆరునెలల బుడతడు నోబెల్ వరల్డ్ రికార్డు సాధించి అందరినీ ఆశ్చర్య పరిచాడు. అతడి తల్లి జంతువులు, పండ్లు, వాహనాలు, అంకెలు, పక్షులు, కూరగాయల ఫొటోలు చూపి వాటిపేర్లను అడిగిన వెంటనే ప్రజ్వల్ టక్కున గుర్తించి అబ్బురపరుస్తున్నాడు. చిన్నారికి గ్రహించగల్గిన శక్తి వచ్చినప్పటి నుంచి ఫొటోలు చూపి వాటి పేర్లను చెప్పడాన్ని తల్లి సౌమ్య అలవాటు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను మొబైల్‌లో చిత్రీకరించి ఈనెల 19న నోబెల్ వరల్డ్ రికార్డ్ సంస్థకు పంపారు. వాటిని పరిశీలించిన నిర్వాహకులు ఆ చిన్నారి ప్రతిభను మెచ్చి ఈనెల 29న ఆన్‌లైన్ ద్వారా అవార్డును పంపారు. వారి కుమార్తె వినీష కూడా నాలుగేళ్ల వయస్సులోనే ఐదు అవార్డు సాధించి అబ్బురపరిచిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. చిన్నారికి అంతర్జాతీయ అవార్డు రావడంతో ఇరుగు పొరుగువారు, బంధువులు అభినందిస్తున్నారు. కాగా ప్రజ్వల్ తండ్రి పట్టణంలోనే వివేకానంద క్లాత్ మార్కెట్‌లో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నాడు. తల్లి గృహిణిగా ఉన్నారు.

అంతర్జాతీయ అవార్డుతో ప్రజ్వల్

ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలి

- జిల్లా ఉపాధ్యక్షులు జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - బద్వేలు
ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక శ్రీనివాస కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మోడీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన 4 లేబర్ కోడ్లు రద్దుచేయాలని, నిత్యావసర, పెట్రోల్, డీజిల్, గ్యాస్, వంటనూనె ధరలను అదుపు చేయాలని పేర్కొన్నారు. ఉపాధి హామీ పనులు 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ. 600 వేతనం చెల్లించాలని, పట్టణాల్లో కూడా అమలుచేయాలని, రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన విభజన హామీలు అమలు చేయాలని, ప్రత్యేక హోదా సాధనకై అధికార, ప్రతిపక్ష రాజకీయ పార్టీలు బీజేపీ విధా నాలపై పోరాడాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని, ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని చెప్పారు. అంగన్వాడీ, ఆశా, యనిమేటర్ల, కాంట్రాక్టు –ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని పేర్కొప్పారు. పనికి తగ్గ వేతనం అమలు చేయాలన్నారు. రానున్న కాలంలో కార్మిక కర్షక సమస్యల కోసం సిఐటియు నిర్వహించే పోరాటాలలో సంఘటిత, అసంఘటితరంగా కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు , జిల్లా కార్యదర్శులు కె. శ్రీనివాసులు, కె. నాగేంద్రబాబు, జిల్లా కమిటీ సభ్యులు పులి శ్యాం ప్రవీణ్, సిఐటియు జిల్లా కమిటిసభ్యురాలు విజయమ్మ పోరుమామిళ్ల నాయకులు సుందరం, రత్నమయ్య, బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ కార్యదర్శి దియ్యాల నాగేంద్రబాబు, దియ్యాల హరి, కాలువ శివకుమార్, గంటా శ్రీనివాసులు, సత్య రాజు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ నాయకులు రఫీ, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరి , ప్రవీణ్, రమణ, అంగన్వాడీ యూనియన్ నాయకురాళు ,,పద్మ, ఉమామహేశ్వరి, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ నాయకురాళ్లు గౌసియా బేగం, రత్నమ్మ బాలమ్మ,మస్తాన్ బీ ,మోక్షమ్మ, గౌతమి, అనంతమ్మ, ఆశ యూనియన్ నాయకురాళ్లు ఆదిలక్ష్మమ్మ, రిజ్వాన్, బిల్డింగ్ యూనియన్ నాయకులు రా యప్ప, నజీరు, రమణయ్య, ఆటో నాయకులు నరసింహులు పాల్గొన్నారు.

విజ్ఞానం పెంపొందించాలి

కడప అర్బన్ : ప్రజల్లో అజ్ఞాన్ని తొలగించి విజ్ఞాన్ని పెంపొందించాల్సిన అవసరమెంతైనా ఉందని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు బాలబయన్న పేర్కొన్నారు. ఆదివారం విద్యానికేతన్ పాఠశాలలో జెవివి నగర మహాసభ నగర అధ్యక్షులు అబ్బాస్‌వలి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా బాల బయన్న మాట్లాడుతూ రాజ్యాంగం లోని ఆర్టికల్ 51ఎ(హెచ్) ప్రకారం శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ప్రజలలోకి వెళిల కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యా, వైద్య రంగంలో మనం కార్యక్రమాలు పెంచాలని కోరారు. సామాన్య ప్రజలకు సైన్స్ ఫలితాలను అందచేయాల్సిన భాధ్యత జనవిజ్ఞాన వేదిక మీద ఉందన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు దేవదత్తం, నగర కార్యదర్శి వసంత్, కామేశ్వరమ్మ, షామీర్ బాషా, వెంకట్రామ రాజు, శివరాం, ప్రకాష్, రాయల్ కరి ముల్లా, మధుసూధన్, సత్యనారాయణ, రాహుల్, జానకీరాం హాజరయ్యారు.

నేతన్నలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్
చేనేతలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని చేనేత ఐక్యవేదిక సంఘం జాతీయ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆదివారం ఆటోనగర్ లోని సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్రా రుణాలు, కూలీ సక్రమంగా అందించాలని కోరారు. ఎన్‌హెచ్‌డిసి ద్వారా నూలు, పట్టు రాయితీతో అందించాలని పేర్కొన్నారు. చేనేత కార్మికులకు ఇచ్చిన ఉచిత విద్యుత్ జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉపాధ్యక్షులు రామదాసు, తేజోవతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అవ్వారు మల్లికార్జున

అద్దె ప్రాతిపదికన స్థలం కేటాయింపు

కడప అర్బన్ : పోలీసు లైన్‌లో పెట్రోల్ బంకు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న 30 సెంట్లు పోలీస్ శాఖ స్థలాన్ని నెలవారి అద్దె ప్రాతిపదికన పాఠశాలలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రుల నిర్మాణం కోసం ఇవ్వనున్నట్లు ఎస్‌పి అన్బురాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు దరఖాస్తులను ఆగస్టు 2లోపు ఆర్ఐ (వెల్ఫేర్) జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు. వివరాలకు 9440941424 నంబరు సంప్రదించాలని తెలిపారు.

శిల్పారామంలో అలరించిన నృత్యాలు

కడప అర్బన్ : నగరంలోని శిల్పారామం కళావేదికపై ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. మిస్పా మూవీ పద్మాకర్ ఆధ్వర్యంలో కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను శిల్పారామం ఎఒ శివప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు.

నృత్యం చేస్తున్న బాలికలు

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆమూరి బాలదాసు

ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్
మణిపూర్ గిరిజనులపై చోటు చేసుకున్న మారణ హోమం ప్రజాస్వామ్యానికి తీరని మచ్చ అని టిడిపి అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. ఆదివారం తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు రెహమాన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల దాసు మాట్లాడుతూ మెయితీల కులాధిపత్యం పోరులో అమాయక గిరిజన ప్రజలు దారుణంగా హింసకు గురి చేస్తూ, మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ అతి కిరాతకంగా చంపడం హేయమైన చర్య అన్నారు. ఈ పరిణామాల పట్ల మణిపూర్, కేంద్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. వెయ్యి మంది మెయితీ తెగల తీవ్రవాదులు ఎకె47 తుపాకులు, మారుణాయుధాలుతో మణిపూర్‌లో విధ్వంసం సృష్టించి క్రైస్తవలను దారుణంగా చంపడం హేయమైనచర్య అన్నారు. ఆయుధాలు ఏ విధంగా వారికి వచ్చాయని మణిపూర్ ముఖ్యమంత్రి బీరన్ సింగ్‌ను ప్రశ్నించగా పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి తెచ్చుకున్నారని అనడం సిగ్గు చేటన్నారు. మణిపూర్ సంఘటన చూసి ప్రపంచ ఒలంపిక్ క్రీడల్లో 11 మంది భారత క్రీడాకారులు వివిధ రంగాలలో సాధించిన అంతర్జాతీయ క్రీడా పుంస్కారాలను సైతం తమ అవసరం లేదని చెప్పడం ఇంత కన్న దుర్మార్గం మరోకటిలేదన్నారు. ప్రధానిమంత్రి నరేంద్ర మోడీ తీవ్రవాదులను సమర్థిస్తూ మౌనం వహించడం, మతకలహాలకు ఆజ్యం పోసిన ప్రధానిగా చరిత్రలో నిలిచి పోయారని పేర్కొన్నారు. సమావేశంలో ఐటిడిపి నగర అధ్యక్షులు వంప్రసాద్, తెలుగుయువత జిల్లా ఉపాధ్యక్షులు సయ్యద్ రెహమాన్ పాల్గొన్నారు.

హ్యూమన్ రైట్స్ సభ్యత్వం స్వీకరణ

ప్రజాశక్తి - కడప అర్బన్
నగరంలోని మట్టి పెద్దపులి వీధిలో ఉన్న సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అండ్ కౌన్సిల్ నగర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్‌బాష ఆధ్వర్యంలో 20 మంది యువకులు హ్యూమన్ రైట్స్ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఆదివారం నియమాక పత్రాలు, ఐడెంటి కార్డు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మన హక్కుల్ని తెలుసుకుని పోరాడి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. పేద ప్రజలను ఆదుకోవాలని, యువత చెడు బారిన పడకుండా దేశ, రాష్ట్ర భవిష్యత్తు కోసం కృషి చేయాలని చెప్పారు. నగర ప్రధాన కార్యదర్శిగా నియామకం పొందిన షేక్. ముజీబ్ మాట్లాడుతూ తనకు బాధ్యత అప్పగించిన సంస్థ చైర్మన్ షా మహమ్మద్‌కు, నగర అధ్యక్షులు లయన్ పఠాన్ ఖాదర్ భాషాకు కృతజ్ఞతలు తెలిపారు సంస్థలో పనిచేసే అవకాశం రావడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎజాస్, దావూద్, కిషోర్, షాజహాన్, రఫీ, ఆరిఫ్ పాల్గొన్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - కడప
మార్కెట్‌లో కూరగాయల ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగి పోతున్నాయని, వాటిని నియంత్రండంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చీకటి చార్లెస్ పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ. 20 ఉన్న టమోట ధర నేడు ఒక్కసారిగా రూ.200కు చేరుకుందని చెప్పారు. మార్కెట్‌లో ఏ కూరగాయ కొనాలంటే రూ.100 పైమాటే. దీంతో సామాన్య మధ్య తరగతి ప్రజలు టమోటకు బదులు చింతపండు వంటకంలో వాడుకుంటున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశానంటుతున్నాయి. కందిపప్పు, వేరుశనగ పప్పు, ఉద్దిపప్పు ఇలా పలురకాల వస్తువుల ధరలు కిలో రూ.200 చేరువలో ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో పలు రాష్ట్రాలలో కురిసిన భారీ వర్షాల కారణంగా టమోట పంట దిగుబడి భారీగా తగ్గిపోయింది అని తెలిపారు. మన రాష్ట్రంలో పండిన పంటను ఢిల్లీ, మహారాష్ట్ర, తమిళ నాడు, ఒడిస్సా, చత్తీష్‌ఘడ్ తదితర ప్రాంతాలకు ఎగుమతి చేయడం వల్లే టమాట ధర విపరీతంగా పెరిగిందని వాపోయారు. ప్రభుత్వం స్పందించి సామాన్యులకు అందుబాటులో ధరలు తీసుకురావాలని కోరారు.

మాట్లాడుతున్న చీకటి చార్లెస్

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

కడప : నగరంలోని 48 డివిజన్, కృపా కాలనీలో ఆదివారం చర్చిలో న్యూ నేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షులు పాస్టర్ పి.మహేష్, సిస్టర్ శాంతమ్మ ఆధ్వర్యంలో మణిపూర్ రాష్ట్రంలో అల్లర్లు ఆగి ప్రశాంతత వాతావరణం నెలకొల్పాలని ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరిగిన అఘాయిత్యాలను నివారించాల్సిన అవసరమెంతైనా ఉందన్నారు. ఎక్కువగా మహిళలను గౌరవించే భారతదేశంలో ఇలాంటి ఘోరమైన సంఘటనలు జరగడం చాలా బాధాకరమన్నారు. అదే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా లు కుల మతాలకు అతీతంగా ప్రజలందరికు సమానత్వ పాలన అందించే విధంగా కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.రవితేజ, శాంతిరాజు, నరసయ్య, ఏ.అగస్టిన్, సరళ, లక్ష్మి, రోజా, లీలావతి అనేక మంది భక్తులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న మహిళలు

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఘన స్వాగతం

కడప : రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు తన మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం రాత్రి ఆర్ అండ్ బి, కడప అతిథి గృహానికి చేరుకున్నారు. ఆయన్ను జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఎపిఆర్ఒ సునీల్ సాగర్, ఎవిఎస్ నాగయ్య, పాత్రికేయులు, సమాచార శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి వాహనదారుడూ పన్నులు చెల్లించాలి

- ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్

ప్రజాశక్తి - కడప
ప్రతి రవాణా వాహన యజమాని మూడు నెలలకు ఒకసారి వారి వాహనాలకు సంబంధించి త్రైమాసిక పన్నులు కచ్చితంగా చెల్లించాలని ఉప రవాణా కమిషనర్ ఈ. మీరా ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రవాణా శాఖకు పన్నులు చెల్లించకుండా తిరిగే వాహనముల తనిఖీ నిర్వహించి పట్టుబడిన వాహనాలకు జరిమానా విధిస్తామని చెప్పారు. జిల్లాలో 7263 రవాణా వాహనాలు త్రైమాసిక పన్నులు బకాయి పడ్డట్టుగా గుర్తించామని పేర్కొన్నారు. వాహన యజ మానులు ఈ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేసి జప్తు చేయడానికి ప్రత్యేక తనిఖీ బృం దాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ తనిఖీలలో పట్టుబడ్డ పన్నులు చెల్లించని వాహ నాలకు చెల్లించవలసిన పన్నులతో పాటుగా 200 శాతం జరిమానా విధిస్తారని చెప్పారు. జిల్లాలో ఉన్నటువంటి 944 విద్యాసంస్థల బస్సులకు గాను ఇప్పటివరకు 855 బస్సులకు ఫిట్నెస్ సర్టిఫికెట్లు జారీ చేశామని వివరించారు. ఇంకా 89 బస్సులు ఫిట్నెస్ నవీకరణ చేసుకోవాల్సి ఉందన్నారు. మోటార్ వాహన చట్టాలు ఉల్లంఘించిన వాహన యజమానులపై డిపార్ట్మెంట్ కేసులు నమోదు చేస్తుందని తెలిపారు. ఏడాదిగా నమోదు చేసిన కేసులలో ఇంకా 13689 వాహన యజమానులు వారి వారి కేసులకు సంబంధించిన రాజీ రుసుం ఇంకనూ చెల్లించలేదని పేర్కొన్నారు. సులు పెండింగ్ ఉన్న వాహన యజమానులు సత్వరమే రాజీ రుసుం చెల్లించి కేసులు రద్దు చేసుకో వాలన్నారు. కడప పట్టణంలో బిల్డప్ సర్కిల్, ఐటిఐ సర్కిల్ , ఎస్ పి బంగ్లా, విజయ టాకీస్ తదితర ప్లేసుల్లో కెమెరాలు ద్వారా స్టాప్ లైన్ క్రాసింగ్, సిగ్నల్ జంపింగ్, ట్రిపుల్ రైడింగ్ మొదలైన మోటార్ వాహన చట్ట ఉల్లంఘనలను కెమెరాలతో గుర్తించి కంప్యూటర్ ద్వారా కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. జూన్ నుంచి ఇప్పటి వరకు 5047 కేసులు నమోదు చేసి జరిమానాలు విధించామన్నారు. నూతన వాహ నాల కొలుగోలు సమయంలో ఆర్‌సి కార్డు కోసం చెల్లించే కార్డు ఫీజు 28 జులై నుంచి ప్రభుత్వం రద్దు చేసిందని చెప్పారు. నూతన వాహన కొనుగోలుదారులు ఎవరు రిజిస్ట్రే షన్ కార్డు కోసం ఏ విధమైన ఫీజు షోరూంలలో చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వాహనానికి సంబంధించి సర్టిఫికెట్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకుని మీ అవసరాలకు వాడుకోగలరని తెలిపారు.



ఉత్తమ విలువలతో కూడిన విద్య అవసరం

కడప అర్బన్ : ఉత్తమ విలువలతో కూడిన విద్యను అందించాలని ఆపస్ జిల్లా అధ్యక్షులు పి.వెంకట్రామిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపస్ కార్యకర్తలు నీతి, నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తూ పిల్లలలో నైతికవిలువలు పెంపొందించడం, దేశభక్తి నిర్మాణం చేయడం, ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. రాష్ట్ర సహ కోశాధికారి కృష్ణార్జునరెడ్డి మాట్లాడుతూ ఆపస్ సంఘ బాధ్యులు సమస్యలు తీర్చడంలో రాష్ట్ర, జిల్లాశాఖలు ముందువరుసలో ఉన్నాయని చెప్పారు. పిఆర్‌సి, డిఎ బకాయిల విషయంలో అధికారులు, ప్రభుత్వంతో నిరంతరం చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని యుద్ధం ప్రాతిపదికన పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట సహ అధ్యక్షులు రామ మోహన్ రెడ్డి, కార్యదర్శి సుబ్బరాయుడు, ఎరుకలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, సుధాకర్ రెడ్డి, బాలకృష్ణుడు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చేనేతల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - ఖాజీపేట

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేనేతల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేస్తున్నారని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లి రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో ఆదివారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నేతన్న నేస్తం పథకం ద్వారా 560 మందికి రూ.1 కోటి 34 లక్షల 40 వేల లబ్ధి చేకూరిందని తెలిపారు. చేనేత కార్మికులు వారి పరికరాలు మెరుగుపరుచుకోవడానికి, పవర్ లూమ్ రంగానికి చెందిన ఉత్పత్తులతో పోటీ పడేందుకు సిఎం జగన్ ప్రతి చేనేత కుటుంబానికి రూ.24,000 ఆర్థికసాయం అందించారన్నారు. సిఎం జగన్‌లాగా గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇంతవరకు నేతన్నలను పట్టించుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో ఎపిఐఐసి రాష్ట్ర డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి, ఎంపిపి అబూబకర్ సిద్దిక్, అగ్రహారం సహకార సంఘం అధ్యక్షులు రాఘవరెడ్డి, వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

మల్లికార్జునరెడ్డిని సన్మానిస్తున్న రెడ్యం

యోగి వేమన విశ్వవిద్యాలయం ఉద్యోగ విరమణ ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అభినందనీయుడని, బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణించి, కీర్తి గడించారని టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కొనియాడారు. మండలంలోని దుంపలగట్టు గ్రామంలో రెడ్యం స్వగృహంలో ఆదివారం మూల మల్లికార్జునరెడ్డి మల్లికార్జునీయం పుస్తకాన్ని రెడ్యంకు అందజేశారు. సందర్భంగా రెడ్యం ఆయనను అభినందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం రెడ్యం మాట్లాడుతూ తుడుమలదిన్నె గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి, తాను ఒకే మండలానికి చెందిన బాల్య మిత్రులమన్నారు. ఎంతోమంది సాహితీ కళాకారులను, కవులను, రచయితలను బ్రౌన్ గ్రంథాలయ గడప తొక్కిస్తూ, గ్రంథాలయ ఉన్నతికి పాటుపడడం మల్లికార్జున సొంతమని ప్రశంసించారు.

నేడు అల్లాడుపల్లె ఆర్‌బికె భవనం ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆర్‌బికె భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి ప్రారంభిస్తున్నట్లు ఎఒ మ్యాగీ తెలిపారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారన్నారు. సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

పెరుగుతున్న సైబర్ నేరాలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలో సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి మోసపోయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కొండాపురం పట్టణానికి చెందిన నవీన్ కుమార్‌రెడ్డి సైబర్ ఆ ఉచ్చులో పడి మోసపోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యూట్యూబ్ ద్వారా పరిచయమైన కేరళ రాష్ట్రానికి చెందిన కుమారి అనే మహిళ నవీన్ కుమార్‌రెడ్డి ఫోన్ నెంబర్‌ను ట్యాప్ చేసి పరిచయమైంది. తర్వాత అతనితో వాట్సాప్ చాటింగ్ ద్వారా పరిచయం చేసుకుని కుమారి అతనికి యూట్యూబ్ లింకు పంపి, టిఅండ్‌జి గ్లోబల్ అనే కంపెనీలో పెట్టుబడులు పెడితే అతి త్వరలో అధికంగా డబ్బులు సంపాదించవచ్చునని, తాను పెట్టానని ప్రోత్సహించింది. ఆ ఉచ్చులో పడి నవీన్ కుమార్‌రెడ్డి మోసపోయి లక్షల రూపాయలు పోగొట్టుకోవడమే కాకుండా తన ద్వారా మరికొందరికి సదరు యూట్యూబ్ లింక్‌ను పంపడంతో ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టి మోసపోయారు. ఆ మేరకు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు సిఐ సుదర్శన ప్రసాద్ తెలిపారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మణిపూర్ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించి, శాంతిని నెలకొల్పాలని తొండూరు వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో ఆయన ఆధ్వర్యంలో ఆదివారం మణిపూర్ ఘటనను నిరసిస్తూ అన్ని చర్చి సంఘాల పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. సిఎస్ఐ చర్చి నుంచి పూలంగళ్ల మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగించి లైంగికంగా దాడి చేసి కొట్టి చంపిన దుండగులను నడిరోడ్డుపై ఉరి తీయాలన్నారు. ఈ ఘటన ప్రతి భారతీయుడ్ని కలిచి వేసిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గోటూరు చిన్నప్ప, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, క్రైస్తవ సంఘాల పెద్దలు త్యాగరాజు పాల్గొన్నారు.

డిటికి వినతిపత్రమిస్తున్న వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి, నాయకులు

ముస్లిం మైనార్టీ హక్కులను పరిరక్షించాలి

ప్రజాశక్తి-రామాపురం

ముస్లిం మైనారిటీల హక్కులను పరిరక్షించాలని రాష్ట్ర ముస్లిం మైనార్టీ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి జాకీర్ అన్నారు. ఆదివారం మండల కమిటీ నిర్వహణ రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షతన మండల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షునిగా నీలకంఠరావుపేటకు చెందిన సయ్యద్ సిరాజుద్దీన్‌ను, ఉపాధ్యక్షులుగా షేక్ ఇంతియాజ్‌ను కార్యదర్శిగా నియమించారు. నీలకంఠరావుపేట గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా సాధిక్, ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ పఠాన్‌ఖాజా, కార్యదర్శిగా సయ్యద్, కోశాధికారిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీర్, రామపురం మండలశాఖ అధ్యక్షులు సిరాజుద్దీన్, గ్రామకమిటీ అధ్యక్షులు షేక్ సాధక్‌వలి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టిడిపిదే విజయం : 'చమర్తి'

ప్రజాశక్తి - వీరబల్లి

రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని నియోజకవర్గపు సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మట్లి పెద్దూరులో మొహర్రం సందర్భంగా రవి నాయుడు కుమారుడు హెక్సీత్‌నాయుడులు ఇచ్చిన విందుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు అధైర్య పడవద్దని వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యమని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే ఎన్నికల్లో గెలుపుకు తప్పక కృషి చేయాలని ఆయన చెప్పారు. ఏ కార్యకర్తల సమస్య వచ్చినా తాను వెన్నంటి ఉండి సహకరిస్తానని పేర్కొన్నారు. అనంతరం చౌడమ్మ ఆలయంలో పీర్ల చావిడిలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడికి వచ్చిన కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్య క్రమంలో మట్లి సర్పంచ్ నాగార్జునచారి, టిడిపి మండల శాఖ అధ్యక్షులు భాను గోపాల్ రాజు, అమరేశ్వర్ రాజు, నాగభూషణం నాయుడు, ఉపాధ్యక్షులు దుర్గ రామాంజనేయులు మహిళాధ్యక్షురాలు నాగు, సుబ్బమ్మ, మాజీ జడ్‌పిటిసి చలమయ్య, ఒంటిమిట్ట మాజీ ఎంపిటిసి లక్ష్మీనారాయణ, రాజంపేట రూరల్ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్‌రాజు, సుండుపల్లి మాజీ ఎంపిటిసి మోహన్‌బాబు నాయుడు పాల్గొన్నారు.

రైతులకు భరోసా.. అగ్రిల్యాబ్

ప్రజాశక్తి - చాపాడు

విత్తనం మేలైనదైతే పంట బాగుంటుంది. అంతా సవ్యంగా జరగాలంటే మంచి విత్తనం కావాలి. అన్నదాతలు నకిలీ విత్తనాలతో మోసపోకుండా వైఎస్ఆర్ అగ్రిల్యాబ్స్ భరోసానిస్తున్నాయి. ఇప్పటికే వైఎస్ఆర్ రైతు భరోసా కేంద్రాల ద్వారా వీటి సేవలు గ్రామాల్లోని రైతులుకు అందుబాటులోకి వచ్చాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు సేవలు మరింత చేరువ చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మేలైన విత్తనాలు, రైతులకు అందాలనే లక్ష్యంతో ఆర్‌బికెలు పనిచేస్తున్నాయి. వ్యవసాయాన్ని మరింతగా ప్రోత్సహించి రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నాయి. వ్యవసాయానికి తొలి అడుగు నాణ్యమైన విత్తనాలు. రైతులు వినియోగించే విత్తనాలు ఎరువులు, పురుగు మందులు పరీక్షించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ఎంతో దోహదపడుతుంది. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి ఒక అగ్రిల్యాబ్ మంజూరైంది. రైతులకు పంపిణీ చేస్తున్న విత్తనాలు, ఎరువుల నాణ్యతపై వీటి ద్వారా పరీక్షలు చేసి రిపోర్టు ఇస్తున్నారు.

ప్రతి ల్యాబ్‌లో ఆటోమేషన్..

అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌కు వచ్చిన నమూనాల పరీక్ష కోసం ప్రత్యేకంగా ఆటోమేటెడ్ క్వాలిటీ కంట్రోల్ యాప్‌ను అభివృద్ధి చేశారు. ల్యాబ్‌లో పరీక్షించిన ఫలితాలను తారుమారు చేసేందుకు వీలు లేకుండా ప్రతి ల్యాబ్ లేబరేటరీలో ఆటోమేషన్ ఏర్పాటు చేశారు. టెస్టింగ్ చేసిన ప్రతి ఒక్కటి రికార్డు కావడంతోపాటు ఫలితాలు వాటి అంతట అవే సిస్టంలో నమోదవుతాయి. రైతు షాపునకు వెళ్ళినప్పుడు బ్యాచ్ నెంబర్ చెక్ చేసుకుంటే చాలు నాణ్యత సర్టిఫికెట్ ఉందో లేదో తెలిసిపోతుంది. రైతులు తమ సొంత విత్తనాల నాణ్యతను అగ్రిల్యాబ్‌లో ఉచితంగా పరీక్షించుకునే అవకాశం కల్పించారు. రైతుల విత్తనాల నమూనాలను ల్యాబ్‌లో అందజేస్తే వాటిని పరీక్షించి నాణ్యత నిర్ధారిస్తారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులను అగ్రిల్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా చైతన్యం తెస్తున్నారు. ప్రతి అగ్రిల్యాబ్‌కు రాష్ట్రంలోని 13 జిల్లాల నుండి డీ కోడింగ్ చేసిన శాంపిల్స్ వస్తున్నాయి. వీటిని పరీక్షించిన తర్వాత రిపోర్టులను పంపిస్తున్నారు. విత్తనాలు, పురుగు మందు కంపెనీలు ఎలాంటి అడ్డదారులు తొక్కకుండా చూసేందుకు ఇలాంటి ఏర్పాట్లు చేశారు. మైదుకూరు అగ్రి టెస్టింగ్‌ల్యాబ్ ద్వారా నియోజకవర్గ పరిధిలోని మండలాల రైతులు సేవలు పొందుతున్నారు. అలాగే గ్రామస్థాయిలో పశవులకు వచ్చే వ్యాధులను నిర్ధారించేందుకు కూడా ఇక్కడ అవకాశం ఉంది. పశువుల పేడ, రక్తం, మూత్రం, పశువు నోటి నుంచి వచ్చిన నురగ శాంపిల్స్‌ను తీసుకువస్తే వాటిని పరీక్షించి పశువుకు వచ్చిన జబ్బును నిర్ధారిస్తారు. తద్వారా అవసరమైన చికిత్స దగ్గరలోని పశు పశువైద్యశాలలో చేయించుకునే అవకాశం ఉంటుంది.

నకిలీ విత్తనాలతో మోసపోకుండా..

రైతులు నకిలీ విత్తనాలతో మోసపోకుండా ఉండేందుకు అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు దోహదపడతాయి. నియోజకవర్గ స్థాయిలో ఒక ల్యాబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతులు ఇచ్చిన నమూనాలను ఉచితంగా పరీక్షించుకునే అవకాశం ఉంది. విత్తనాలు నాటకముందే పరిస్థితి తెలిస్తే రైతులు నష్టపోయే ప్రమాదం ఉండదు.

- మ్యాగీ, వ్యవసాయ అధికారి, చాపాడు

రైతులకు ఎంతో ఉపయోగం..

నిర్దేశించిన విధంగా ల్యాబ్‌కు వచ్చిన నమూనాలను సిబ్బంది పరీక్షిస్తున్నారు. ఈ ల్యాబ్‌లు రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. రైతులు నమూనాలను తెస్తే వారంలోపు రిపోర్టు ఇస్తున్నారు. ఆధునిక టెక్నాలజీ ఉండడంతో నామూనాలను పరీక్షించడంలో ఎలాంటి పొరపాట్లు జరిగే అవకాశం లేదు.

- కృష్ణమూర్తి ఎడిఎ, వ్యవసాయ కార్యాలయం, మైదుకూరు

మతసామరస్యానికి ప్రతీక పీర్ల పండుగ

పీర్లు ఊరేగింపులో చింతలమడుగుపల్లె ప్రజలు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీ పరిధిలోని చింతలమడుగుపల్లెలో ఆదివారం పీర్ల పండుగను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. మతసామరస్యానికి ప్రతిక మొహర్రం కావడంతో వేంపల్లె గ్రామంలోని హిందు, ముస్లింలు కలిసి పండుగ చేసుకొన్నారు. జడ్‌పిటిసి రవికుమార్‌రెడ్డి, సర్పంచు రాచినేని శ్రీనివాసులు, వైసిపి మండల కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, మాజీ సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడ్డి పీర్ల చావిడిలో నిలబెట్టిన ఇమామ్ హుస్సేన్ పీర్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామంలో ఉన్న వారందరూ కలసికట్టుగా పీర్ల ఉత్సవంలో పాల్గొని రంగులు చల్లుకొంటూ పీర్లను జల్దీకి తీసుకెళ్లారు. చింతలమడుగుపల్లెలోని పీర్లు చావిడి వద్ద అగ్నిగుండం ఏర్పాటు చేశారు. పీర్లు జల్దీకి వెళ్లే సమయంలో గ్రామంలో ఉన్న ప్రజలు పీర్లుకు ప్రత్యేక పూజలు చేసి సంబరాలు చేసుకోవడంతో చింతలమడుగుపల్లె జనాలతో కోలాహలంగా మారింది. చింతలమడుగుపల్లె నుండి వేంపల్లెలోని పురవీధుల గుండా పీర్లును ఎత్తుకొని పాపాఘ్ని నదిలోకి తీసుకెళ్లారు. ఇమామ్ ఉసేన్ పీర్లు ఊరేగింపుగా రావడంతో వాటిని చూసేందుకు వేంపల్లెలోని గాంధీ రోడ్డులోకి పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చారు. పీర్ల చావిడి కమిటీ తరుపున జడ్‌పిటిసి, సర్పంచ్, మాజీ సర్పంచ్, వైసిపి మండల కన్వీనర్లను సత్కరించారు. సిఐ వెంకటేశ్వర్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో పీర్ల చావిడి పూజారులు, చింతలమడుగుపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో అత్యంత పేరుగాంచిన మస్తాన్ స్వామి పీరు ఉత్సవం అంకాలమ్మ గుడి ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, కౌన్సిలర్ ఖాదర్ బాషా, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం జెండామాను వీధిలోని పీర్ల చావిడిలో పీర్లను కొలువుదీర్చి ముస్తాబు చేశారు. మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పీర్లను దర్శించుకున్నారు. అనంతరం వారిని ఉత్సవ కమిటీ వారు గౌరవ సత్కారం చేశారు. పీర్లను అగ్నిగుండ ప్రవేశం చేసి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంబడి పెద్ద ఎత్తున డప్పు వాయిద్యాలు, విచిత్ర వేషదారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. జెండామాను వీధి నుంచి గాడిచర్లవీధి, అమ్మవారిశాల, మెయిన్ బజార్, పూలంగళ్ల సర్కిల్ మీదుగా పీర్ల ఉత్సవం జరిగింది.

గ్రామోత్సవంలో మస్తాన్‌స్వామి పీర్లు

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేషస్పందన లభించింది. వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. దాదాపు 200 మంది పరిసర ప్రాంత ప్రజలకు పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉచిత గుండె పరీక్షలలో భాగంగా జిఆర్‌పిఎస్, బిపి, ఇసిజి, 2డి, ఏకో వంటి పరీక్షలను నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన రోగులకు మందులు కూడా ఉచితంగా అందించినట్లు తెలిపారు. కిమ్స్, సవేరా హాస్పిటల్స్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మానవతా సంస్థ చైర్మన్ రఘురామిరెడ్డి, అధ్యక్షులు మల్లికార్జునరెడ్డి, సభ్యులు షర్ఫుద్దీన్, గంగాధర్ రెడ్డి, షాహిద్, సాంబశివరెడ్డి, రాజవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

అధ్వానం.. వేంపల్లె-రాయచోటి రోడ్డు

ఆగిన పనులు - పట్టని అధికారులు

అసంపూర్తిగా ఉన్న వేంపల్లె -రాయచోటి రోడ్డు

ప్రజాశక్తి - చక్రాయపేట

సిఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోనే రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటే.. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఎలా ఉంటాయో అర్థం అవుతుందని ఈ ప్రాంతం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చక్రాయపేట మీదుగా వేంపల్లె-రాయచోటి రోడ్డు విస్తరణ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించారు. విస్తరణ పేరుతో రోడ్డును తవ్వారు.. రోడ్డు పనులు మాత్రం పూర్తి చేయలేదు. పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇడుపులపాయకు వచ్చిన సిఎం జగన్ 10 నిమిషాలుపాటు రాయచోటి రోడ్డులో ప్రయాణిస్తే వాహనదారులు, ప్రయాణికుల పరిస్థితి తెలుస్తుందని ఈ ప్రాంతం ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్డు వెంబడి ఎక్కడి పడితే అక్కడ గుంతలు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. కొండ నాలుకకు మందువేస్తే అసలు నాలుక ఊడినట్లు ఉందన్నారు. గుంతల్లో వాహనాలు వెళ్లడం వల్ల అవి కూడా దెబ్బతిని షెడ్లకు పోతున్నట్లు చెప్పారు. గంట ప్రయాణానికి 2 గంటలు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. గర్భిణులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వేంపల్లె-రాయచోటి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తయ్యేలా సిఎం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగం.. పాల సేకరణ భవనాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని పలు గ్రామాలలో పాల సేకరణ కేంద్రాలు నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్నాయి. గత 33 సంవత్సరాల క్రితం సిద్ధారెడ్డి పల్లి, నాగులపల్లి, విశ్వనాథపురం, ఓబుల్ రెడ్డి పేట, చిన్నగురువలూరు, అనంతపురం, అన్నవరం, గ్రామాల్లో సహకార సంఘాలను ఏర్పాటు చేసి దాతల నుండి స్థలాలను సేకరించి పాలసేకరణ కేంద్రాలను నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన పాలను ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రొద్దుటూరు, మైదుకూరు తరలించేవారు. కాలక్రమేణా ప్రభుత్వ పాలకేంద్రాలు మూతపడ్డాయి. ప్రైవేట్ పాల కేంద్రాలు అందుబాటులోకి రావడంతో ప్రభుత్వ పాల సేకరణ కేంద్రాలు మరుగున పడ్డాయి. ఈ పరిస్థితుల్లో భవనాలు చాలావరకు దెబ్బతిన్నాయి. సిద్ధారెడ్డిపల్లి గ్రామంలో గత ఐదు సంవత్సరాల క్రితం పాలసేకరణ భవనానికి మరమ్మతులు చేపట్టి మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. అది రెండు సంవత్సరాలు కొనసాగిన తర్వాత మూతపడింది. ప్రభుత్వ కార్యాలయాల కోసం వీటికి మరమ్మతులు చేసి వినియోగించుకునే అవకాశం ఉంది. విశ్వనాథపురంలో రోడ్డు విస్తరణలో కొంతభాగం భవనాన్ని తొలగించారు. పూర్తిగా దెబ్బతిన్న భవనాలను తొలగించి వాటి స్థానంలో ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించుకునే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ప్రభుత్వం అమూల్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సిద్ధారెడ్డిపల్లిలో నిరుపయోగంగా ఉన్న పాల సేకరణ కేంద్రం

విష పురుగుల సంచారంతో ప్రాణభయం

ప్రజాశక్తి - కొండాపురం

చనిపోయిన కొండచిలువ

మండలంలోని పునరావాస కాలనీలో విష పురుగుల సంచారంతో ప్రజలు ప్రాణభయంతో ఉన్నారు. గండికోట ప్రాజెక్టులో ముంపునకు గురైన ముచ్చుమర్రి ప్రజలకు కొండ ప్రాంతంలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కాలనీలో నివసిస్తున్న ప్రజలు భయాం దోళనలతో రోజును గడుపుతున్నారు. కొండ ప్రాంతం కావడంతో నిత్యం విష పాముల సంచారం ఎక్కువైంది. అవి పశుపక్షాదులను కాటు వేస్తున్నాయని హడలిపోతు న్నారు. ఆదివారం మధ్యాహ్నం ముచ్చుమర్రి కాలనీ ప్రాం తంలో పెద్ద కొండచిలువ ఊరి వైపునకు వస్తుండగా గమనించిన ప్రజలు అక్క డికి వెళ్లి కొండచిలువను చంపేశారు. ఇది తెలిసిన ప్రజల్లో భయాందోళన అధిక మైంది. విషపురుగుల నుంచి తమను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



నాయకులకు సూచనలిస్తున్న టిడిపి ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి

చంద్రబాబు పర్యటనను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల నియోజకవర్గంలో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు పర్యటనను విజయవంతం చేద్దామని ఆపార్టీ పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన చంద్రబాబు పర్యటనపై నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బిటెక రవి మాట్లాడుతూ ఆగష్టు 2న ప్రాజెక్టు పరిశీలన నిమిత్తం చంద్రబాబు పులివెందులకు వస్తున్నారన్నారు. బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు పులివెందులలోని పూల అంగళ్ల వద్ద గాని, వెంకటేశ్వర ఆలయం వద్దగాని బహిరంగ సభ ఉంటుందన్నారు. పులివెందుల నియోజకవర్గంలోని సమస్యలను అర్జీలు రూపంలో కార్యకర్తలు చంద్రబాబుకు ఇస్తే వాటిపై బహిరంగసభలో మాట్లాడేందుకు వీలుంటుందన్నారు. పంటల బీమా పాత విధానంలో మంజూరయ్యేలా ప్రకటన చేయించాలని కార్యకర్తలు బిటెక్ రవిని కోరారు. సిఎం జగన్ సొంత ఊరు బలపనూరులో చంద్రబాబు భోజన విరామం చేస్తారన్నారు. అనంతరం పులివెందులకు చేరుకుంటారని చెప్పారు. సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథరెడ్డి, మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, జయచంద్రారెడ్డి, ఆర్‌వి రమేష్, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణవలి, మహమ్మద్ ఇనాయతుల్లా, పాపిరెడ్డి, బ్రహయ్య, చంటి, డక్కా రమేష్, వీరబద్ర, నాగభూషణంరెడ్డి, తూగట్ల రాఘవరెడ్డి, మల్లింగి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కరీముల్లా, దొంతు సుబ్బారావు, పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రచయితను అభినందిస్తున్న రచయితలు, ప్రముఖులు

'అలంకారం' కృషి ఆదర్శనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక అనిబిసెంట్ ఉన్నతపాఠశాల ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం కళాభారతి నాటక సంస్థ, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో అలంకారం వేంకట రమణరాజు రచించిన చిత్రకవితా సౌరభం గ్రంథ పరిచయ సభను నిర్వహించారు. ప్రముఖ రచయిత కొమ్మిశెట్టి మోహన్ సభాధ్యక్షుడిగా, అతిథులుగా చదువుల సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ పద్య కవులు ఎ.సి.దస్తగిరి, డాక్టర్ వి.యమ్.భాస్కరరాజు, టిటిడి ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు డాక్టర్ మూలె రామమునిరెడ్డి, గ్రంథాలయం అధికారిణి తిరుపతమ్మ, సాహితీ వేత్తలు జి.వి.సాయి ప్రసాద్, అవధానం అమృతవల్లి, అలంకారం విజయకుమార్, కొత్తపల్లి శీను హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక రచయిత అలంకారం వేంకట రమణరాజు దాదాపు 400పైగా ప్రాచీన సాహిత్య గ్రంథాలను 12 సంవత్సరాలు పరిశోధించి, ఆ గ్రంథాల్లో ఉన్న చిత్రవిచిత్రమైన ప్రయోగాలతో కూడిన చిత్రకవిత్వ శ్లోకాలను, పద్యాలను సేకరించి చిత్రకవితా సౌరభం పేరుతో గ్రంథాన్ని రూపొందించారన్నారు. ఇది మొదటి భాగమని, ఇంకా 11భాగాలు ప్రచురణకు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఆయన పట్టుదల, కృషి, ఓర్పు ఆదర్శనీయమన్నారు. ఈ పరిశోధనాత్మక గ్రంథ రచనకు రచయితకు డాక్టరేట్ ఇవ్వాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, కళాకారులు హాజరై రచయితను అభినందిస్తూ,సత్కరించారు.

ఐఐఆర్‌టి యశోదను సన్మానిస్తున్న మానవతా సభ్యులు

అభాగ్యులకు అండగా నిలవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సమాజంలోని అనాథలు, అభాగ్యుల అవసరాలకు అండగా నిలిచేందుకు మానవత సేవలు విస్తృతం చేయాలని మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మాసాంతర సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు భవిత విభిన్న ప్రతిభావంతుల కేంద్రం ఐఈఆర్టీ యశోదను సత్కరించి, మెమోంటో అందించారు. ఈ సందర్భంగా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ మానవత సేవా సంస్థ అభాగ్యులను ఆదుకునేందుకు ముందుంటుందన్నారు. ఎక్కువగా సభ్యత్వాలు చేపట్టాలని కోరారు. ఇడుపులపాయలోని నెమళ్ల పునరుత్పత్తి కేంద్రంలో, నెమ్మళ్లకు అవసరమైన ఆహార దాణా పంపిణీ చేశారు. ఆర్‌కెవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జ్యోతికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా ఎన్నికైన చల్లా బాలాజీ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కావలి కృష్ణతేజా, మానవత ఉపాధ్యక్షుడు కావలి ముత్యాలయ్య, డైరెక్టర్లు రంగారెడ్డి, డాక్టర్లు రంగయ్య, రాజారాం, సభ్యులు శ్రావణ్ కుమార్, రహీం, చిన్న నర్సింహులు పాల్గొన్నారు.

NAME CHANGE

Sunanda dadhi(old name) W/o Adavala Nagarjuna, 11/95-2, Road no: 5, Devuni Ka dapa, YSR Dis trict-516002, AP, In dia is changing name to Adavala sunanda(new name) for all future purposes.

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 31 జులై 2023
5
అన్నమయ్య

నేడు యథావిధిగా స్పందన

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10.00 గంటల నుంచి 'జగనన్నకు చెబుదాం - స్పందన' అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో నిర్వహించే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఎ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.

కొంపలు కూల్చే ప్రభుత్వం : పిసిసి

ప్రజాశక్తి - రాయచోటి

జగన్‌ది కొంపలు కూల్చే ప్రభుత్వమని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ ఎన్. తులసిరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటి- సుండుపల్లె రోడ్డు విస్తరణ సందర్భంగా ప్రభుత్వం జెసిబిలతో కూల్చివేసిన పేదల ఇళ్ల శిథిలాలను కాంగ్రెస్ పార్టీ రాయచోటి కన్వీనర్ ఎస్. అల్లా బకాష్ (సిఎల్‌పి) ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 ఏళ్లుగా రాయచోటి - సుండుపల్లి రోడ్డుకు ఇరుపక్కల ప్రజలు పక్కా ఇల్లు సొంతంగా నిర్మించుకొని జీవిస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఎలాంటి నోటీసులు, నష్టపరిహారం, ముందస్తు సమచారం ఇవ్వకుండా తెల్లవారు జామున జెసిబిలతో వచ్చి ఇళ్లు కూల్చి వేస్తున్నట్లు బాధితులు కాంగ్రెస్ నాయకులకు మొరపెట్టుకున్నారని చెప్పారు. ఇంత దౌర్జన్యమా, రౌడీయిజమా అని ఆయన ప్రశ్నించారు. రోడ్డు విస్తరణ కార్యక్రమం మంచిదే కానీ ముందస్తు సమాచారం, నష్టపరిహారం ఇవ్వకుండా ఇళ్లు కూల్చి వేయడం అన్యాయమని చెప్పారు. వెంటనే బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, జిల్లా అధ్యక్షులు నజీర్ అహ్మద్ మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడుతున్నారని నష్టపోతున్నారని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులతోపాటు ప్రతి ఒక్కరికీ మంచి అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్.ఎం.డి గౌస్, సోషల్ మీడియా చైర్మన్ నరేష్, మాజీ పట్టణ అధ్యక్షులు ఫారుక్, పట్టణ అధ్యక్షులు ఖాదర్‌ఖాన్, ఆర్‌టిఐ చైర్మన్ అమీర్ ఖాన్, మన్సూర్ అలీఖాన్, దర్బార్ భాష, ఖాదర్ బాష, ఎం.డి. రఫీక్ మైసూర్ రెడ్డి , నాగ లత , అజంతుల్లా, అరిఫుల్ల, ప్రసాద్ గౌడ్, ఉబేదుల్లా, షాహుల్ అహ్మద్, నాగమునిరెడ్డి, ఇబ్రహీం ఖాన్, ఇర్ఫాన్, మహమ్మద్, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బాధితుల సమస్యలు వింటున్న తులసిరెడ్డి

రైతుల ప్రయోజనమే
పరమావధి

- పన్ను వసూళ్ల లక్ష్యాన్ని చేరుకుంటాం
- 74 మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు
- రీజినల్ జాయింట్ డైరెక్టర్ చల్లా రామాంజనేయులు వెల్లడి

ముఖా ముఖి..

రైతు ప్రయోజనమే పరమావధిగా పని చేస్తాం. ఈ-నామ్ వంటి ఆధునిక మార్కెటింగ్ వ్యవస్థ ద్వారా దేశీయ మార్కెట్‌ను రైతు ముంగిటకు చేరువ చేశాం. ఫలితంగా జిల్లాలోని రైతాంగ ఉత్పత్తులకు దేశంలోని ఏయే మార్కెట్లలో ఎటువంటి గిరాకీ ఉందో ముందుగానే తెలుసుకునే సౌలభ్యం కలిగింది. రాయలసీమ రీజియన్ పరిధిలో 74 మార్కెట్‌యార్డు వివరాలను అందుబాటులో తెచ్చాం. పత్తి ఎంఎస్‌పి ధరలు ఏటా పెరుగు తున్న నేపథ్యంలో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు చేసే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. రీజియన్ పరిధిలోని 259 గోడౌన్లలో వ్యవసాయ ఉత్పత్తు లను నిల్వ చేసుకునే సదుపాయాన్ని కల్పించాం. మార్కెట్లో మెరుగైన ధర లభించినప్పడు విక్రయించుకునే అవకాశం ఉందని పేర్కొంటున్న రాయల సీమ రీజియన్ జాయింట్ డైరెక్టర్ చల్లా రామాంజనేయులుతో ప్రజాశక్తి ముఖాముఖి...

-ప్రజాశక్తి - కడపప్రతినిధి

మార్కెట్‌యార్డుల వివరాలు తెలపండి?

రీజియన్ పరిధిలో 74 మార్కెట్‌యార్డులున్నాయి. కడప, చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల్లోని మార్కెట్ యార్డుల ద్వారా ఈ- నామ్ తదితర సేవల ద్వారా మెరుగైన సేవల నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తున్నాం.

మార్కెట్ లావాదేవీల గురించి తెలపండి?

2022-2023లోరూ.120 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడమైంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి జూన్ నాటికి తిరుపతి మార్కెట్‌యార్డు మినహా మిగిలిన మార్కెట్‌యార్డులన్నీ పురోగమన దిశలో పయనిస్తుండడం ఆహ్వానించదగిన విషయం. మిగిలిన తొమ్మిది నెలల వ్యవధిలో రూ.122 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని సునాయాసంగా చేరు కునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం.

గోడౌన్ల సామర్థ్య వివరాలు తెలపండి?

రాయలసీమ రీజియన్ పరిధిలో 259 గోడౌన్లున్నాయి. 2,11,735 టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. కడపలోని 39 గోడౌన్లలో 30,315 టన్నులు, అనంతపురంలోని 44 గోడౌన్లలో 30,120 టన్నులు, చిత్తూరులోని 18 గోడౌన్లలో 17,950 టన్నులు, కర్నూలులోని 32 గోడౌన్లలో 35,940 టన్నులు, నంద్యాలలోని 41 గోడౌన్లలో 41, 600 టన్నులు, తిరుపతిలోని 34 గోడౌన్ల లో 27, 100 టన్నులు, అన్నమయ్యలోని 21 గోడౌన్లలో 9,160 టన్నులు, సత్యసాయి జిల్లాలోని 30 గోడౌన్లలో 19,650 మెట్రిక్ టన్నుల మేర వ్యవసాయ ఉత్పత్తులను నిల్వ చేసుకునే అవకాశం ఉంది.

ఆదోని మార్కెట్ పురోగతిని వివరించండి?

రీజియన్ పరిధిలో అధిక ఆదాయం ఆదోని మార్కెట్ యార్డు ద్వారా సమకూరుతోంది. 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.16 కోట్ల ఆదాయం సంపాదించింది. ఇక్కడికి కర్నాటకలోని రాయచూర్, తెలంగాణాలోని గద్వాల్ తదితర ప్రాంతాల నుంచి సరుకుల లావాదేవీలు ఉన్నాయి. ఫలితంగా ఆధోని మార్కెట్‌యార్డు అత్యధిక ఆదాయాన్ని సమకూర్చు తోంది.

చెక్‌పోస్టుల వివరాలు, ఉనికి గురించి తెలపండి?

రీజియన్ పరిధిలో 155 చెక్‌పోస్టులున్నాయి. అనంతపురం జిల్లాలో 32, చిత్తూరులో 60, కడపలో 28, కర్నూలు జిల్లాలో 35 చెక్ పోస్టులున్నాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా చెక్‌పోస్టుల ద్వారా సెస్సుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గింది.

సిసిఐ ఏర్పాటు గురించి వివరించండి?

ప్రొద్దుటూరులో సిసిఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది. విభజిత వైఎస్ఆర్ జిల్లావ్యాప్తంగా 55 వేల ఎకరాల్లో పత్తి పంట పెద్దఎత్తున సాగవుతోంది. ప్రతియేటా పెద్దఎత్తున దిగుబడుల నేపథ్యంలో ప్రొద్దుటూరు సిసిఐ కేంద్రాన్ని సీజన్ సమయంలో సిసిఐ ఆధ్వర్యంలో పత్తి సేకరణ చేపడుతోంది. ఇటీవల ఆర్‌బికె వ్యవస్థ అందుబాటులోకి రావడం ద్వారా ఆర్బీకేల ద్వారా సేకరించిన పత్తిని మిల్లర్లకు సరఫరా చేయడం జరుగుతోంది. దీంతో సిసిఐ ఏర్పాటుపై స్పష్టత రావాల్సి ఉంది.

రీజియన్ మార్కెట్లలోని క్రయ,విక్రయాల గురించి తెలపండి?

రీజియన్ పరిధిలోని మార్కెట్లలో అత్యధికంగా ఆధోని మార్కె ట్‌లో వ్యాపార కార్య కలాపాలు సాగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో పత్తి, వేరుశనగ, కందులు, పసుపు, టమోటో, మామిడి, కూరగాయలు, వాము మొదలగు ఇతర పంటల క్రయవిక్రయాల జోరు కొనసాగుతోంది.

సేవాతత్వం అలవర్చుకోవాలి : డిఎస్‌పి

డిఎస్‌పిని సన్మానిస్తున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి ఒక్కరు సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడే సేవా తత్వాన్ని అలవర్చుకోవాలని, సేవకు మించిన సంతృప్తి మరొకటి ఉండదని డిఎస్‌పి మహబూబ్‌బాష పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో మానవత నెలవారీ సమావేశాన్ని ఉపాధ్యక్షులు ఖాదర్‌బాష, కార్యదర్శి రామానాయుడు అధ్యక్షతన నిర్వహంచారు. సమావేశానికి ముఖ్య అతిథిగా రాయచోటి డివిజన్ మహబూబ్‌బాష హాజరయ్యారు ఆయన్ను రాయచోటి మానవత శాఖ చైర్మన్ అరమాటి శివగంగి రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, గౌరవ సలహాదారులు వెంకటరమణ, రిటైర్డ్ జడ్జి రెడ్డికుమార్ చేతుల మీదగా గజమాలతో సత్కరించి శాలువాతో సన్మానించి మానవత మేమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా ఉచితంగా సేవలు చేయడం సంతోషకరమని చెప్పారు. మానవత సంస్థ ఫీజర్ బాక్స్ , శాంతి రథం అంబులెన్స్ ద్వారా ఉచితంగా సేవలు చేస్తుండడం అభినందనీయమన్నారు. కేవలం సేవా కార్యక్రమాలే కాకుండా పర్యావరణాన్ని పెంపొందించేలా మొక్కలను నాటి వాటిని సంరక్షించడం, విద్యార్థులకు మానవత విలువల పట్ల అవగాహన కల్గించడం, విద్యను ప్రోత్సహించేలా కార్యక్రమాలను నిర్వహించడం ప్రసంశనీయమని చెప్పారు. .దేశానికే రైతు వెన్నుముక్క అయిన రైతన్నలను గుర్తించి వారికి సంస్థ తరపున సన్మానంతో పాటు నగదు ప్రోత్సాహకలను అందించడం శుభపరిణామమన్నారు. భవిష్యత్తులో కుడా మానవత సంస్థ ద్వారా విరివిరిగా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ అందరి మన్నలు పొందాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో రెడ్డప్ప రెడ్డి ,డాక్టర్ ధరణి ,మనోహర్ రెడ్డి, చిన్న, శ్రీధర్ రెడ్డి, నరసింహ రెడ్డి, ఆర్.వి.రాజు, మురళి, మానవత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మాలల సమస్యల పరిష్కారానికి కృషి

అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలోని మాలల ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కృషి చేస్తామని మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గుర్రం రామారావు, ఇండియన్ లేబర్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మద్దు అంకయ్య, మాల మహానాడు ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం నారాయణ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో మాల మహానాడు ఐక్యవేదిక నాలుగవ ఆవిర్భావ సందర్భంగా మాలల ఆత్మీయ సమావేశం పాటూరి దామోదరం, నిసాని రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలు మాలలు ఎదుర్కొంటున్న సమస్యలు, వారు పడుతున్న సామాజిక, ఆర్థిక పరమైన ఇబ్బందుల గురించి, రావాల్సిన ఉద్యోగాలలో రిజర్వేషన్లపై చర్చించారు. రాజకీయంగా ముందుకు పోవాలంటే అందరం కలిసిఉద్యమాలు చేయాలన్నారు. మాల మహానాడు ఐక్యవేదిక పేద బడుగు ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. తొలత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో చీకటి పల్లి రామాంజాలు, నక్క రమణ, పాటూరి దామోదరం ,నిసాని రామాంజులు, లక్ష్మీదేవి,రెడ్డమ్మ పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యమం ఉధృతం చేస్తాం

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యుత్ ఉద్యోగుల, కాంట్రాక్టు కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కారానికి యాజమాన్యం, ప్రభుత్వంతో 16 నెలలుగా 25 సార్లు చర్చలు జరిపినా ఎలాంటి సానుకూల స్పందన లేదని అందుకే ఎ.పి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఏర్పాటు చేసి విద్యుత్ ఉద్యమం ఉధృతం చేస్తున్నామని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈనెల 26న యాజమాన్యానికి సమర్పించిన వినతి పత్రంలోని అంశాలను యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి మాట్లాడుతూ సిఎం జగన్ హామీ మేరకు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. వేతన సవరణ ఒప్పందం తర్వాత కూడా విద్యుత్ స్ట్రగుల్ కమిటీ పోరాటాలు చేస్తుం దని పేర్కొన్నారు. జిల్లా నాయకులు యన్. శివశంకర్ మాట్లాడుతూ స్ట్రగుల్ కమిటీ పిలుపు మేరకు ఈనెల 31న కలెక్టర్లకు వినతి పత్రం అందజేయడం, ఆగస్టు 2న జిల్లా కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు, 7న తిరుపతి కార్పొరేట్ కార్యాలయం ఎదుట ఆందోళన కార్యక్రమాలకు విద్యుత్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు తరలి వచ్చి మన నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. ఎల్ఐసి డివిజన్ నాయకులు అవధానం శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల వేతన సవరణ 16 నెలలు గడిచినా ప్రకటించక పోవడం అన్యాయమని పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులను 25 ఏళ్లుగా వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. ఆశా వర్కర్ల జిల్లా నాయకులు రాజామణి మాట్లాడుతూ విద్యుత్ స్ట్రగుల్ కమిటీకి మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే మార్గమని తెలిపారు. స్ట్రగుల్ కమిటీ ఉపాధ్యక్షులు గంగయ్య మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్‌టిపిపి నాయకులు వెంకట స్వామి, విజయా, రమేష్ సాంబశివారెడ్డి, నాగేంద్ర మాట్లాడుతూ ఉద్యమం ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. జిల్లా స్ట్రగుల్ కమిటీ నాయకులు నాగసుబ్బయ్య, శ్రీ హరి మాట్లాడుతూ 31వ తేదీన చర్చలు విద్యుత్ ఉద్యోగులకు, కాంట్రాక్ట్ కార్మికులకు, ఎనర్జీ అసిస్టెంట్లకు మేలు జరిగేలా ఉండాలని ఆకాంక్షించారు.

ఆరు నెలల బుడతడి నోబెల్ వరల్డ్ రికార్డ్

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రజ్వల్ అనే ఆరు నెలల చిన్నారి అంతర్జాతీయ అవార్డు సాధించి అందరినీ అబ్బుర పరిచాడు. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణ పరిధిలోని శాస్త్రినగర్‌కు చెందిన పవన్‌కుమార్, సౌమ్యప్రియ దంపతులకు నాలుగేళ్ల వినీషతోపాటు ఆరునెలల కుమారుడు ఉన్నాడు. ఆరునెలల బుడతడు నోబెల్ వరల్డ్ రికార్డు సాధించి అందరినీ ఆశ్చర్య పరిచాడు. అతడి తల్లి జంతువులు, పండ్లు, వాహనాలు, అంకెలు, పక్షులు, కూరగాయల ఫొటోలు చూపి వాటిపేర్లను అడిగిన వెంటనే ప్రజ్వల్ ఠక్కున గుర్తించి అబ్బురపరుస్తున్నాడు. చిన్నారికి గ్రహించగల్గిన శక్తి వచ్చినప్పటి నుంచి ఫొటోలు చూపి వాటి పేర్లను చెప్పడాన్ని తల్లి సౌమ్య అలవాటు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలను మొబైల్‌లో చిత్రీకరించి ఈనెల 19న నోబెల్ వరల్డ్ రికార్డ్ సంస్థకు పంపారు. వాటిని పరిశీలించిన నిర్వాహకులు ఆ చిన్నారి ప్రతిభను మెచ్చి ఈనెల 29న ఆన్‌లైన్ ద్వారా అవార్డును పంపారు. వారి కుమార్తె వినీష కూడా నాలుగేళ్ల వయస్సులోనే ఐదు అవార్డు సాధించి అబ్బురపరిచిందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. చిన్నారికి అంతర్జాతీయ అవార్డు రావడంతో ఇరుగు పొరుగువారు, బంధువులు అభినందిస్తున్నారు. కాగా ప్రజ్వల్ తండ్రి పట్టణంలోనే వివేకానంద క్లాత్ మార్కెట్‌లో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. తల్లి గృహిణిగా ఉన్నారు.

అంతర్జాతీయ అవార్డుతో ప్రజ్వల్

నియోజకవర్గ అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి..

అవకాశమిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా
కడదాకా టిడిపితోనే నా ప్రయాణం
మేడా విజయశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

పాలకుల నిర్లక్ష్యం వల్ల అనాదిగా రాజంపేట అభివృద్ధికి నోచుకోక ఆమడ దూరంలో ఉందని, నియోజకవర్గాన్ని అన్ని రంగాలలోనూ అభివృద్ధి పరచేందుకే రాజకీయ ప్రవేశం చేస్తున్నట్లు ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి సోదరుడు మేడా విజయశేఖర్ రెడ్డి తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ టికెట్ ఆశిస్తూ ఇటీవల పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు, అచ్చం నాయుడు వంటి అగ్ర నేతలను కలిసిన తరుణంలో ప్రజలలో నెలకొన్న సందిగ్ధతను తొలగిస్తూ ఆదివారం బోయినపల్లిలోని హరిత హోటల్‌లో ఆయన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల వైద్య కళాశాల మదనపల్లికి, జిల్లా కేంద్రం రాయచోటికి తరలిపోయాయని అన్నారు. స్వలాభాల కోసం నాయకులు రాజంపేట, నందలూరు అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. జిల్లా కేంద్రం కోసం చేసిన ఉద్యమాలలో తాను కీలకంగా వ్యవహరించే సమయంలో వైసిపి నాయకులు తనను దూరం పెడుతూ వచ్చారని, ఆది నుంచి టిడిపి విధి విధానాలు, చంద్రబాబు నాయుడు వ్యక్తిత్వం తనను ఆకట్టుకుంటూ వచ్చాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే రాజంపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం టిడిపి నేతలను కలవడం జరిగిందని, తనకు టికెట్ ఇస్తే గెలుపు బావుటా ఎగురవేసి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. జిల్లా కేంద్రం కోల్పోవడం పట్ల రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట వాసులు పూర్తి అసంతృప్తితో ఉన్నారని, తాను అధికారంలోకి వస్తే మొట్టమొదట జిల్లా కేంద్రాన్ని సాధించి పెడతానని తెలిపారు. నందలూరులో తిరిగి ఆల్విన్ కేంద్రాన్ని తీసుకువస్తానని, నాయకుల భూకబ్జాలను వెలికి తీస్తానని అన్నారు. తాను అధికారంలోకి వచ్చిన ఏడాదికే చెప్పిన హామీలన్నీ నెరవేర్చుతానని, అలా చేయలేని పక్షంలో అధికారానికి, రాజకీయాలకు శాశ్వతంగా స్వస్తి పలుకుతానని తెలిపారు. అధినేత ఎవరికి టికెట్ కేటాయించినా తన సంపూర్ణ మద్దతు, సహాయ- సహకారాలు ఉంటాయని, కడదాకా టిడిపితోనే తన ప్రయాణమని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభ్యున్నతి కోసం పాటుపడతానని తెలియజేశారు. భావి ముఖ్యమంత్రి నారా లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్రకు జనం బ్రహ్మరథం పడుతున్నారని 2024లో టిడిపిదే అధికారం అనేందుకు ఇదే నిదర్శనమని అన్నారు. మాస్ లీడర్ పవన్ కల్యాణ్ చేపడుతున్న వారాహి యాత్రకు విశేష స్పందన ఉందని, వైసిపి కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అతి త్వరలోనే అశేష జన సంఖ్యతో, కార్యకర్తలతో పసుపు కండువా కప్పుకునేందుకు రంగం సిద్ధం చేసుకున్నానని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు తాను చేరువుగా ఉంటానని, ప్రజలు తనను ఆదరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం

లయన్స్ క్లబ్ అభయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

లయన్స్ క్లబ్ అభయను అన్నివిధాలా అభివృద్ధి పథంలో నడిపిస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు లయన్ ఎన్.సుబ్బారెడ్డి, లయన్ బి.కరుణాకర్‌రెడ్డి పేర్కొన్నారు. మదనపల్లి పట్టణం, బైపాస్ రోడ్డులోని వెన్నెల రెస్టారెంటులో పండుగ వాతావరణంలో లయన్స్ క్లబ్ అభయ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులుగా జిల్లా మాజీ గవర్నర్ లయన్ వి.విజయభాస్కర్ రెడ్డి, మల్టీపుల్ మాజీ చైర్‌పర్సన్ లయన్ సి.వి.భానుమూర్తి రెడ్డి, కె.భక్తవత్సలం రెడ్డి హాజరయ్యారు. ఇందులో భాగంగా ఎన్.సుబ్బారెడ్డి లయన్స్ క్లబ్ అభయ అధ్యక్షులుగా, కార్యదర్శిగా బి.కరుణాకర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అభయ సేవాకార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని చెప్పారు. సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌కు పోటీపడుతామన్నారు. క్లబ్ మొదటి ఉపాధ్యక్షులుగా లయన్ ఓ.మహేశ్వర్ రెడ్డి, రెండవ ఉపాధ్యక్షులుగా లయన్ టి.శ్రీనివాసులు, కోశాధికారిగా లయన్ జి.సునీల్ కుమార్, సర్వీసెస్ చైర్మనుగా లయన్ సి.సాయి శేఖర్ రెడ్డిలను నియమించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అభయ ప్రతినిధులు దేశాయ్ జయదేవ్ రెడ్డి, డాక్టర్ కే.రాజారెడ్డి, కె.సంజీవ రెడ్డి, జి.గౌతమ్ రెడ్డి, పి.ఎం.రాజశేఖర్ రెడ్డి, ఎం.భాస్కర్ రెడ్డి, ఎన్.ముత్యాలు వివేకానంద ఆశయం ఫౌండేషన్ శ్రీకాంత్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

నరేష్‌కుమార్‌రెడ్డికి అరుదైన గౌరవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మాజీ ఎమ్మెల్సీ బి. నరేష్ కుమార్తె ఒడ్డికి అరుదైన గౌరవం దక్కింది. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లక్నో వారు ఎక్సలెన్సీ ఎగ్జిక్యూటివ్ డిజిటల్ ఫైనాన్స్ ట్రాన్స్ఫర్మేషన్ (బ్యాచ్ 01)లో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లక్నో నరేష్ రెడ్డిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన ఒడియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ లక్నో వారికి కృతజ్ఞతలు తెలిపారు. నరేష్ రెడ్డి కుటుంబ సభ్యులు, అభిమానులు ఆనందం వ్యక్తం చేసారు.

మాట్లాడుతున్న నరసింహారెడ్డి

చలో విజయవాడ జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆగస్టు 21, 22 తేదీలలో విజయవాడలో నిర్వహించే ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ 21వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు ఎక్కువ సంఖ్యలో ఉద్యోగస్తులు అందరూ హాజరై రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని మదనపల్లి అసోసియేషన్ సమావేశం తాలూకా అధ్యక్షులు ఎస్.నరసింహారెడ్డి, కార్యదర్శి రెడ్డి శేఖర్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చిత్తూరు జిల్లా అధ్యక్షులు కె.వి. రాఘవులు, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. రాష్ట్ర సమావేశాలకు ఆగస్టు 21న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్‌సిడిఎస్ జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా పద్మప్రియారెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అన్నమయ్య జిల్లా మహిళా ఉపాధ్యక్షులుగా మదనపల్లి పట్టణానికి చెందిన ఎర్రగుంట్ల పద్మప్రియారెడ్డి నియమితులయ్యారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాలవ శ్రీలతారెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు శారదా రెడ్డి ఆదివారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెడ్ల సంక్షేమం, వారి అభ్యున్నతి కోసం అలుపెరుగని కృషి చేస్తానన్నారు. నిరుపేద రెడ్లను అన్నివిధాల ఆదుకోవడమే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు. ఇతర రెడ్డి సంఘాలను సమన్వయం చేసుకొని, క్రమశిక్షణతో ముందుకెళ్లి రెడ్డి జాతి సమస్యలపై అవగాహన పెంచుకొని ఐక్యత కోసం పాటుపడతానన్నారు. సొసైటీ బలోపేతానికి అలుపెరుగని కృషి చేస్తానని స్పష్టం చేశారు. తనకు పదవి అప్పగించిన సొసైటీ అధ్యక్షులు యర్రపురెడ్డి సురేంద్ర రెడ్డి, రాష్ట్ర మహిళా అధ్య క్షురాలు కాలవ శ్రీలతా రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. లింగాల శ్యామ్ కుమార్ రెడ్డి, 31వ వార్డు ఇన్‌ఛార్జి ఎస్.రవీంద్ర రాయల్, మనీలా రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.



నియామక పత్రం అందుకుంటున్న పద్మప్రియారెడ్డి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న జనసేన నాయకులు

జనసేనతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-వీరబల్లి

జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ పేర్కొన్నారు. పవనన్న ప్రజాబాట కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలం పరిధిలోని సానిపాయ గ్రామపంచాయతీలో పర్యటించి ప్రతి ఇంటికి జనసేన పార్టీ రూపొందించిన సిద్ధాంతాల కరపత్రాలను పంచుతూ,జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాల నుంచి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తున్నారని అన్నారు. వైసిపి పాలన చేసిన తప్పులకు ఏ ఒక్క కంపెనీ గాని, కంపెనీ సిఇఒలు గాని కన్నెత్తి చూడటం లేదన్నారు. నిరుద్యోగులకు జాబ్ కాలండర్ రిలీజ్ చేస్తామని చెప్పి వాగ్దానం చేసి చేతులు దులుపుకున్నారన్నారు. 2024 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి వైకాపా నాయకులకు డిపాజిట్లు కూడా దక్కవన్నారు. రాబోయే 2024 ఎన్నికలలో జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రిని చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య, ఎంవిఆర్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసులు, వెంకటేశు, జయరాం, జనసేన సీనియర్ నాయకుడు భాస్కర్ పంతులు, పోలిశెట్టి శ్రీనివాసులు, అబ్బిగారి గోపాల్, కిషోర్, జనసేన వీర మహిళలు జెడ్డా శిరీష, మాధవి పాల్గొన్నారు.

ఓటు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలో 18 ఏళ్ల పూర్తయిన యువత ఓటు నమోదు చేసుకోవాలని తహశీల్దార్ రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామాల్లోకి విఆర్ఎలు, విఆర్ఒలు ఓటు నమోదు చేసుకుంటారని, ఓటు హక్కు నమోదు చేసుకునే వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోటోలు తీసుకొని వస్తే ఓటు వారి పేరు మీద ఓటు నమోదు చేస్తామని చెప్పారు. ఓటు నమోదు కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆలయానికి నగదు వితరణ

ప్రజాశక్తి-కలకడ

ఆలయ ధర్మకర్తకు నగదును అందిస్తున్న వాసంతి

మండలంలోని దొడ్డిపల్లి పంచాయతీ గోపాల పురంలో వెలిసిన శ్రీషిరిడి సాయిబాబా ఆలయ అభివృద్ధికి రూ.2వేలు వితరణ చేశారు. సంబేపల్లి మండలం ఎస్.సోమ వారం పంచాయతీ అగ్రహా రంకు చెందిన సులోచన, రఘు నాథ్‌ల కుమార్తె నగిరిమడుగు వాసంతి బీటెక్ పూర్తి చేసిన అనంతరం చెన్నై నగరంలో హెచ్‌సిఎల్ కంపెనీలో ఉద్యోగం రావడంతో తన మొక్కుబడిగా ఆలయ అభివృద్ధి కోసం రూ.2వేలు ఆలయ ధర్మకర్త నాగయ్య కు అందించారు.

ముస్లిం మైనార్టీ హక్కులను పరిరక్షించాలి

ప్రజాశక్తి-రామాపురం

ముస్లిం మైనారిటీల హక్కులను పరిరక్షించాలని రాష్ట్ర ముస్లిం మైనార్టీ పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి జాకీర్ అన్నారు. ఆదివారం మండల కమిటీ నిర్వహణ రాష్ట్ర కార్యదర్శి అధ్యక్షతన మండల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల శాఖ అధ్యక్షునిగా నీలకంఠరావుపేటకు చెందిన సయ్యద్ సిరాజుద్దీన్‌ను, ఉపాధ్యక్షులుగా షేక్ ఇంతియాజ్‌ను కార్యదర్శిగా నియమించారు. నీలకంఠరావుపేట గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా సాధిక్, ఉపాధ్యక్షులుగా షేక్ రఫీ పఠాన్‌ఖాజా, కార్యదర్శిగా సయ్యద్, కోశాధికారిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీర్, రామపురం మండలశాఖ అధ్యక్షులు సిరాజుద్దీన్, గ్రామకమిటీ అధ్యక్షులు షేక్ సాధక్‌వలి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదానం గొప్పది

ప్రజాశక్తి-గాలివీడు

సినీ నటుడు సోనూసూద్ జన్మదినం సందర్భంగా మెడికల్‌స్టోర్ బాబ్జి, అంబులెన్స్ డ్రైవర్ రామాంజులు ఆధ్వర్యంలో కసిరెడ్డి వెంకటశివారెడ్డి, అమిన్ చేతుల మీదుగా ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో యువకులు ఉత్సాహం పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం అభినందనీ యమన్నారు.ఎంతో మంది రక్తం అందక ప్రాణాలను కోల్పోతున్నారని అటువంటి వారిని ఆదుకునేందుకు రక్తదానం చేయడం గొప్ప విషయమన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. యువత రక్తదానంపై మరింత అవగాహన పెంచాలన్నారు. మానవతా దృక్పథంతో చేసే కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమం చేపట్టిన అంబు లెన్స్ రామంజులు, మెడికల్ స్టోర్ బాబ్జీలను అభినందించారు.

దాతలను సన్మానించాలి

ప్రజాశక్తి-గాలివీడు

దానం చేసే మనస్సున్న దాతలను సన్మానించాలని మానవత సంస్థ అద్యక్షులు సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సుబ్బారెడ్డి మిషన్ వద్ద సభ్యులు రామమోహన్‌నాయుడు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. బాడీ ఫ్రీజర్ బాక్స్ ప్రకటించిన కుడుముల జయరామిరెడ్డిని, సంస్థకు రూ.10వేలు ప్రకటించిన పొట్లి జగన్నాధారెడ్డిని సంస్థ సభ్యులు సన్మానించారు. మానవత సంస్థలో భాగస్వాములై సహకారం అందిస్తున్న దాతల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ శివారెడ్డి, అధ్యక్షుడు రామమోహన్ నాయుడు, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి చెంగల్‌రాజు, మాజీ అధ్యక్షులు చంద్రారెడ్డి, డాక్టర్ నరసింహులు, డైరక్టర్లు దామోదరయ్య, శివ, డాక్టర్ శంకర్‌శెట్టి, కృష్ణయ్య, అంజీ, భాస్కర్‌రాజా, మానవత సభ్యులు పాల్గొన్నారు.

అభాగ్యులకు అండగా నిలవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

సమాజంలోని అనాథలు, అభాగ్యుల అవసరాలకు అండగా నిలిచేందుకు మానవత సేవలు విస్తృతం చేయాలని మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో మాసాంతర సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు భవిత విభిన్న ప్రతిభావంతుల కేంద్రం ఐఈఆర్టీ యశోదను సత్కరించి, మెమోంటో అందించారు. ఈ సందర్భంగా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ మానవత సేవా సంస్థ అభాగ్యులను ఆదుకునేందుకు ముందుంటుందన్నారు. ఎక్కువగా సభ్యత్వాలు చేపట్టాలని కోరారు. ఇడుపులపాయలోని నెమళ్ల పునరుత్పత్తి కేంద్రంలో, నెమ్మళ్లకు అవసరమైన ఆహార దాణా పంపిణీ చేశారు. ఆర్‌కెవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జ్యోతికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేయూతనిచ్చారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షునిగా ఎన్నికైన చల్లా బాలాజీ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కావలి కృష్ణతేజా, మానవత ఉపాధ్యక్షుడు కావలి ముత్యాల య్య, డైరె క్టర్లు రంగారెడ్డి, డాక్టర్లు రంగయ్య, రాజా రాం, సభ్యులు శ్రావణ్‌కుమార్, రహీం, చిన్న నర్సిం హులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో టమోటా ధరలు

ప్రజాశక్తి-కలికిరి

మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న టమోటా

స్థానిక కలికిరి మార్కెట్‌లో రికార్డు స్థాయిలో టమోటా ధరలు పలుకుతున్నాయి. గత నెల రోజుల నుండి ఒక ట్రే టమోటా ధర వెయ్యి రూపాయల నుండి రూ.2400 రూపాయలు వరకు ధరలు పలుకుతూ కలికిరి మార్కెట్ చరిత్రలోనే రికార్డు నెలకొల్పాయి. గత సంవత్సరం పూర్తిగా టమాట ధరలు లేక రైతులకు నిరాశ మిగిల్చగా, జనవరి నుంచి సాధారణ రేట్లే కొనసాగుతుండడంతో అధిక మంది రైతులు టమోటా పంట వైపు ఆసక్తి చూపడం లేదు. ఇతర రాష్ట్రాలలో భారీ వర్షాలతో పంట మొత్తం దెబ్బతినడంతో మార్కెట్‌కు ఎక్కువ టమోటాలు రాకపోవడంతో ఉన్నట్టుండి ధరలు ఆకాశాన్ని అంటాయి. టమోటా మార్కెట్లో గత వారం రోజులుగా 15 కేజీల ట్రే రూ.1500 నుంచి 2400 పలుకుతూ ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. మూడు నెలల పాటు టమోటా ధరలు ఇలాగే కొనసాగునుండగా కలికిరి చుట్టుపక్కల ప్రాంతాల్లోని రైతులు వందల ఎకరాల్లో టమోట పంటను పండించడానికి సిద్దమవుతున్నారు. వినియోగదారులు ధరలు ఎప్పుడు తగ్గుతాయోనని ఎదురు చూస్తున్నారు.

హార్సిలీహిల్స్‌ను సందర్శించిన హైకోర్టు జడ్జి

పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న హైకోర్టు జడ్జి మన్మధరావు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మదనపల్లి, ఒంగోలు, సింగరాయకొండ కోర్టుల పరిశీలనల్లో భాగంగా హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి మన్మధరావు ఆదివారం బి.కొత్తకోట మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు విచ్చేశారు. అల్పాహారం తర్వాత కొండపై విస్తృతంగా పర్యటించి, ఆహ్లాదకర వాతావరణంలో సేదతీరారు. ముఖ్యంగా ప్రసిద్ధిగాంచిన గవర్నర్ బంగ్లా, విపాయింట్, గాలిబండ ఫారెస్ట్ బంగ్లాను సందర్శించారు.ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ భారతదేశంలో ప్రముఖ పర్యాటక కేంద్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన హార్సిలీహిల్స్ ప్రకృతి రమణీయంగా ఉందని, ఇక్కడ అందాలు ఆకట్టుకున్నాయని కితాబునిచ్చారు. అనంతరం ఆయన హార్సిలీ హిల్స్ నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. జడ్జి వెంట ఎస్ఐ రామ్మోహన్, పోలీసులు,కోర్టు సిబ్బంది ఉన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం

ప్రజాశక్తి-నందలూరు

సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి కె.లత

మానవ అక్రమ రవాణా నేరమని జూనియర్ సివిల్ జడ్జి కె.లత అన్నారు. ఆదివారం ఆడపూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలను, పిల్లలను కొనడం, అమ్మడం వారితో వ్యభిచారం చేయించడం నేరమన్నారు. వ్యభిచార గృహం నుంచి బయటపడిన మహిళల ఎలాంటి వివక్ష చూపకూడదని, సమాజంలో మనుషుల బాధ్యత ఏమిటి అనే దానిపై వివరించారు. ఆర్టికల్ 23(1) ప్రకారం మానవ అక్రమ రవాణా, వెట్టి చాకిరి నిషేధించబడిందని, అంతేకాకుండా అట్టి వాటికి పాల్పడిన వారు శిక్షార్హులని అన్నారు. పిల్లలు ఆకర్షణకు లోనై తెలియని వాళ్ళతో చాటింగ్ చేయడం, అత్యాశకులోనై సైబర్ నేరాలు ఆహ్వానిస్తూ ప్రమాదంలో పడిపోతున్నారని చెప్పారు. చదువుకోవడం ప్రతి ఒక్కరీ ప్రాథమిక హక్కని చదువుకుంటే ఏదైనా సాధించవచ్చని తెలిపారు. టెక్నాలజీని మంచి కోసమే వాడాలని, టెక్నాలజీ అధికంగా వాడితే నేరాలు ఆహ్వానించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ మేజిస్ట్రేట్ పి.శివ శంకరయ్య, న్యాయవాదులు ఆనంద్ కుమార్, దాసరి నరసింహులు, వినయ్, షమీఉల్లాఖాన్, అనుదీప్ జయసింహ, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అనిత , కళాశాల సిబ్బంది, కోర్టు సిబ్బంది, పిఎల్‌విలు పాల్గొన్నారు.

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యం : ఆర్ఆర్

ప్రజాశక్తి-గాలివీడు

టిడిపి మేనిఫెస్టో కరపత్రాలతో మహిళలు

మహిళా సాధికారత టిడిపితోనే సాధ్యమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గరుగు పల్లె పంచాయితీలో పర్య టించి ఇంటింటికి వెళ్ళి టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనపై ప్రజలకు విరక్తి చెందారన్నారు. పెరిగిన నిత్యావసర ధరలతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం భారమైందన్నారు. టిడిపి అధికారం లోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తామన్నారు. 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1500 అందిస్తామని, సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ఇప్పటికే చంద్రబాబు ప్రకటించారన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి ఆదరించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మహిళా నాయ కులు సంధ్య, సుజాత, లక్ష్మీదేవి, రాజ, లక్ష్మీ, శిరీష ఉమామహేశ్వరి, కళావతి, చంద్రకళావతి, సావిత్రి, మల్లేశ్వరి, లక్ష్మమ్మ, అనిత, మాజీ సర్పంచ్ చిపప్పరెడ్డి, భద్రప్ప నాయుడు, మాజీ కో-ఆప్షన్‌మెంబర్ మహు బూబ్‌బాషా, లక్ష్మమయ్య, సురేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-కలకడ

ఉపాధ్యాయులతో పూర్వపు విద్యార్థులు

మండల పరిధిలోని నడిమిచర్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1991-1992 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో భాగంగా అప్పటి గురువులు మాజీ ప్రధానోపాధ్యాయులు ఓబుల్ రెడ్డిని, రెడ్డి సుబ్బరాయుడులను ఘనంగా సన్మానించారు. 1991-1992 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థుల జ్ఞాపకార్థంగా మొటుకు మధుసూదన్‌రెడ్డి, పాఠశాలకు రూ.22వేలు విలువ గల మైక్‌సెట్, స్పీకర్లు విరాళంగా అందించారు. 32 సంవత్సరాల తర్వాత విద్యార్థులు మొదటిసారి కలుసుకున్నారు. ఒకరికొకరు క్షేమ సమాచారాలు తెలుపుకొని, పాఠశాలలో ఆనందంగా గడపారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను 32 సంవత్సరాల తర్వాత గౌరవించుకోగలగడం తమ అదృష్టంగా విద్యార్థులందరూ భావించారు. మాజీ ప్రధానోపాధ్యాయులు ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్య, జీవితం విలువలను తెలిపారు. ఉత్తమ విద్యను అభ్యసించిన వారు జీవితంలో మహోన్నత విలువలతో ఉన్నత స్థాయిలో జీవించగలరని తెలిపారు.ఈ బ్యాచ్‌లోని మాజీ సైనికో ఉద్యోగులు ప్రభాకర్, జనార్దన్‌రెడ్డిలు కార్యక్రమానికి సహకారం అందించిన నాగరాజా లను పూర్వ విద్యార్థులందరూ సన్మానించారు. కార్యక్రమంలో ప్రస్తుతం నడిపించెర్ల జడ్‌పిహైస్కూల్ హెచ్‌ఎం శంకరయ్య, ఉపాధ్యాయులు ప్రసాద్, పూర్వ విద్యార్థులు ఎన్‌వి.నాగరాజా, శ్రీనాథుడు, కొత్తపల్లి జనార్దన్‌రెడ్డి, అగ్రహారం ప్రభాకర, మోటుకు మధుసూదన్ రెడ్డి, టి.అమర్నాథ్, రామ్మోహన్ రావు, జ్యోతి, భ్రమర మల్లిక, అరుణ పాల్గొన్నారు.

అధ్వానం.. వేంపల్లె-రాయచోటి రోడ్డు

ఆగిన పనులు - పట్టని అధికారులు

అసంపూర్తిగా ఉన్న వేంపల్లె -రాయచోటి రోడ్డు

ప్రజాశక్తి - చక్రాయపేట

సిఎం జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలోనే రోడ్లు అధ్వానంగా ఉన్నాయంటే.. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో ఎలా ఉంటాయో అర్థం అవుతుందని ఈ ప్రాంతం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చక్రాయపేట మీదుగా వేంపల్లె-రాయచోటి రోడ్డు విస్తరణ పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించారు. విస్తరణ పేరుతో రోడ్డును తవ్వారు.. రోడ్డు పనులు మాత్రం పూర్తి చేయలేదు. పనులు పూర్తి కాకపోవడంతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇడుపులపాయకు వచ్చిన సిఎం జగన్ 10 నిమిషాలుపాటు రాయచోటి రోడ్డులో ప్రయాణిస్తే వాహనదారులు, ప్రయాణికుల పరిస్థితి తెలుస్తుందని ఈ ప్రాంతం ప్రజలు పేర్కొంటున్నారు. రోడ్డు వెంబడి ఎక్కడి పడితే అక్కడ గుంతలు. రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. కొండ నాలుకకు మందువేస్తే అసలు నాలుక ఊడినట్లు ఉందన్నారు. గుంతల్లో వాహనాలు వెళ్లడం వల్ల అవి కూడా దెబ్బతిని షెడ్లకు పోతున్నట్లు చెప్పారు. గంట ప్రయాణానికి 2 గంటలు పడుతున్నట్లు పేర్కొంటున్నారు. గర్భిణులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారుల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వేంపల్లె-రాయచోటి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తయ్యేలా సిఎం చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

పెరుగుతున్న సైబర్ నేరాలు

ప్రజాశక్తి - కొండాపురం

మండలంలో సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి మోసపోయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. కొండాపురం పట్టణానికి చెందిన నవీన్ కుమార్‌రెడ్డి సైబర్ ఆ ఉచ్చులో పడి మోసపోయినట్లు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. యూట్యూబ్ ద్వారా పరిచయమైన కేరళ రాష్ట్రానికి చెందిన కుమారి అనే మహిళ నవీన్ కుమార్‌రెడ్డి ఫోన్ నెంబర్‌ను ట్యాప్ చేసి పరిచయమైంది. తర్వాత అతనితో వాట్సాప్ చాటింగ్ ద్వారా పరిచయం చేసుకుని కుమారి అతనికి యూట్యూబ్ లింకు పంపి, టిఅండ్‌జి గ్లోబల్ అనే కంపెనీలో పెట్టుబడులు పెడితే అతి త్వరలో అధికంగా డబ్బులు సంపాదించవచ్చునని, తాను పెట్టానని ప్రోత్సహించింది. ఆ ఉచ్చులో పడి నవీన్ కుమార్‌రెడ్డి మోసపోయి లక్షల రూపాయలు పోగొట్టుకోవడమే కాకుండా తన ద్వారా మరికొందరికి సదరు యూట్యూబ్ లింక్‌ను పంపడంతో ఆ కంపెనీలో పెట్టుబడి పెట్టి మోసపోయారు. ఆ మేరకు ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనిపై సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసినట్లు సిఐ సుదర్శన ప్రసాద్ తెలిపారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.



కార్యకర్తలు, గ్రామస్తులతో చమర్తి జగన్మోహన్‌రాజు

రాబోయే ఎన్నికల్లో టిడిపిదే విజయం : 'చమర్తి'

ప్రజాశక్తి-వీరబల్లి

రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపు తథ్యమని నియోజకవర్గపు సీనియర్ నాయకులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మట్లి పెద్దూరులో మొహర్రం సందర్భంగా రవి నాయుడు కుమారుడు హెక్సీత్‌నాయుడు లు ఇచ్చిన విందుకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు అధైర్య పడవద్దని వచ్చే ఎన్నికల్లో గెలుపు తథ్యమని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే ఎన్నికల్లో గెలుపుకు తప్పక కృషి చేయాలని ఆయన చెప్పారు. ఏ కార్యకర్తల సమస్య వచ్చినా తాను వెన్నంటి ఉండి సహకరిస్తానని పేర్కొన్నారు. అనంతరం చౌడమ్మ ఆలయంలో పీర్ల చావిడిలో ప్రత్యేక పూజలు చేశారు. అక్కడికి వచ్చిన కార్యకర్తలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మట్లి సర్పంచ్ నాగార్జునచారి, టిడిపి మండల శాఖ అధ్యక్షులు భాను గోపాల్ రాజు, అమరేశ్వర్ రాజు, నాగభూషణం నాయుడు, ఉపాధ్యక్షులు దుర్గ రామాంజనేయులు మహిళాధ్యక్షురాలు నాగు, సుబ్బమ్మ, మాజీ జడ్‌పిటిసి చలమయ్య, ఒంటిమిట్ట మాజీ ఎంపిటిపి లక్ష్మీనారాయణ, రాజంపేట రూరల్ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు సతీష్‌కుమార్‌రాజు, సుండుపల్లి మాజీ ఎంపిటిసి మోహన్‌బాబునాయుడు పాల్గొన్నారు.

పీర్లను ఊరేగిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

మత సామరస్యానికి ప్రతీకగా మొహర్రం వేడుకలు

ప్రజాశక్తి-పుల్లంపేట

హిందూ, ముస్లింలు సంయుక్తంగా చేసుకునే మొహర్రం వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని రెడ్డిపల్లె, దలవాయిపల్లె, కేతరాజుపల్లె, ఖాదర్‌పేట గ్రామాల్లో హిందూ ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మొహరం పండగను హిందూ ముస్లిం ఐక్యతకు మారుపేరుగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారని తెలిపారు. చివరి రోజు పండుగను పురస్కరించుకొని పీర్లను ప్రత్యేకమైన పుష్పాలతో అలంకరించి ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి మూల మల్లికార్జునరెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

యోగి వేమన విశ్వవి ద్యాలయం ఉద్యోగ విరమణ ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అభి నందనీ యుడని, బహు ముఖ ప్రజ్ఞాశాలిగా రాణిం చి, కీర్తి గడించారని టిడిపి ఆవిర్భావ రాష్ట్ర సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కొనియాడారు. మం డలంలోని దుంపలగట్టు గ్రామంలో రెడ్యం స్వగృ హంలో ఆదివారం మూల మల్లికార్జునరెడ్డి మల్లికార్జునీయం పుస్తకాన్ని రెడ్యంకు అందజేశారు. సందర్భంగా రెడ్యం ఆయనను అభినందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం రెడ్యం మాట్లాడుతూ తుడుమలదిన్నె గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి, తాను ఒకే మండలానికి చెందిన బాల్య మిత్రులమన్నారు. ఎంతోమంది సాహితీ కళాకారులను, కవులను, రచయితలను బ్రౌన్ గ్రంథాలయ గడప తొక్కిస్తూ, గ్రంథాలయ ఉన్నతికి పాటుపడడం మల్లికార్జున సొంతమని ప్రశంసించారు.

'అలంకారం' కృషి ఆదర్శనీయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక అనిబిసెంట్ ఉన్నతపాఠశాల ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం కళాభారతి నాటక సంస్థ, చదువుల సాహిత్య కళావేదిక ఆధ్వర్యంలో అలంకారం వేంకట రమణరాజు రచించిన చిత్రకవితా సౌరభం గ్రంథ పరిచయ సభను నిర్వహించారు. ప్రముఖ రచయిత కొమ్మిశెట్టి మోహన్ సభాధ్యక్షుడిగా, అతిథులుగా చదువుల సాహిత్య కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత డి.కె.చదువులబాబు, సంస్కృతి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రముఖ పద్య కవులు ఎ.సి.దస్తగిరి, డాక్టర్ వి.యమ్.భాస్కరరాజు, టిటిడి ధర్మ ప్రచార పరిషత్ సభ్యులు డాక్టర్ మూలె రామమునిరెడ్డి, గ్రంథాలయం అధికారిణి తిరుపతమ్మ, సాహితీ వేత్తలు జి.వి.సాయి ప్రసాద్, అవధానం అమృతవల్లి, అలంకారం విజయకుమార్, కొత్తపల్లి శీను హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ పుస్తక రచయిత అలంకారం వేంకట రమణరాజు దాదాపు 400పైగా ప్రాచీన సాహిత్య గ్రంథాలను 12 సంవత్సరాలు పరిశోధించి, ఆ గ్రంథాల్లో ఉన్న చిత్రవిచిత్రమైన ప్రయోగాలతో కూడిన చిత్రకవిత్వ శ్లోకాలను, పద్యాలను సేకరించి చిత్రకవితా సౌరభం పేరుతో గ్రంథాన్ని రూపొందించారన్నారు. ఇది మొదటి భాగమని, ఇంకా 11భాగాలు ప్రచురణకు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఆయన పట్టుదల, కృషి, ఓర్పు ఆదర్శనీయమన్నారు. ఈ పరిశోధనాత్మక గ్రంథ రచనకు రచయితకు డాక్టరేట్ ఇవ్వాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు, కళాకారులు హాజరై రచయితను అభినందిస్తూ,సత్కరించారు.

క్రైం కార్నర్

మహిళను గాయపరిచిన ఇద్దరిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

మహిళను గాయపరిచిన ఇద్దరిపై వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు..మండలంలోని బాటవారిపల్లె పంచాయతీ ఎస్‌టి కాలనీకి చెందిన మూడే బాబునాయక్ అతని భార్య శంకరమ్మలకు, అదే గ్రామానికి చెందిన మూడే బాబునాయక్ తమ్ముడు రవినాయక్ అతని భార్య శిరీషలకు భూములకు సంబంధించిన తగాదాలు ఉండేవన్నారు. ఈ క్రమంలో భూతగాదాల కారణంగా శనివారం సాయంత్రం గొడవపడి మూడే రవినాయక్, అతని భార్య శిరీషలు కలిసి శంకరమ్మను గాయపరచినట్లు తెలిపారు. గాయపడిన శంకరమ్మను భర్త బాబునాయక్ చికిత్స నిమిత్తం 108 వాహనంలో పీలేరు ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆదివారం శంకరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రవినాయక్, శిరీషలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

30 లీటర్ల నాటుసారా స్వాధీనం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో నాటుసారాను తరలిస్తూ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ పి.రామకృష్ణ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం మండలంలోని గంగాపురంపల్లి, నిమ్మనపల్లి లోని పలు ప్రాంతాలలో నాటుసారా విక్రయ స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారన్నారు. ఈ దాడుల్లో వాల్మీకిపురం మండలం మేకల వారి పల్లె, చింతపర్తికు చెందిన చిన్న వెంకటరమణ, చరణ్ అనే ఇద్దరు వ్యక్తులు గంగాపురంపల్లి, నిమ్మనపల్లిలో నాటు సారాను అమ్ముతుండగా వారిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 30 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. నాటు సారా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.